అక్టోబర్ - 2024

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక


సంపాదకులు :

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**

B.A.,B.L.,


**చందా వివరాలు :**

సంవత్సర చందా రూ. 350/-

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-


**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లోపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9440217726


**బ్యాంకు అకౌంటు వివరాలు :**

A/c Name: **K. Emmanial Rajendra**

A/c No.: **10957294340**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | కె. ఇ. రాజేంద్ర | 02 |
| జప్పుత్వనేహు | కొడవటికంటి | 03 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 06 |
| నాణెమైన జీవితము | కె. ఇ. రాజేంద్ర | 08 |
| మధ్యకాలము | హన్నాకృప డెస్క్ | 9 |
| ఖుద్దూస్ | సాక్ష్యము | 10 |
| నీ సృష్టికర్త | హన్నాకృప డెస్క్ | 13 |
| క్రొత్తకోణాలు | అద్దంకి జాన్‌వెస్లీ | 14 |
| దేవుడు అంగీకరించే ఉపవాసము | డా॥ సుష్మ, నెల్లూరు | 17 |
| యెహోవా యీరె | కె. ఇ. రాజేంద్ర | 18 |
| ఓర్పా | స్త్రీల కొరకు | 20 |
| దేవుని ప్రణాళిక | చిన్నపిల్లల పేజి | 22 |
| బైబిల్ క్విజ్-10 | | 24 |



**HANNA KRUPA**

**Christian Devotional Monthly Magazine**

**సంపుటి : 21 సంచిక : 10**


**ప్రభువగు యెహోవాయే నాకు బలము**

| | |
|---|---|
| సీరియల్ నంబరు | |

సంపాదకీయం....

# నీవు అవమానమునొందవు

హన్నాకృప పాఠకులకు ప్రభువు నామమున వందనములు.

ఈ లోకంలో ప్రతి మనిషి తాను బ్రతకటానికి ఏదో ఒక దాని మీద ఆధారపడతాడు. అంటే కొంతమంది మనుష్యులను, కొంతమంది ఉద్యోగాన్ని, కొంతమంది వ్యాపారాన్ని, కొంతమంది తప్పుడు మార్గాల్ని ఆధారము చేసికొని జీవితం కొనసాగిస్తారు. అయితే ఈ మార్గాలన్నీ మనుష్యులకి సంతోషాన్ని, సమాధానాన్ని ఇవ్వలేవు. మనుష్యుల మీద ఆధారపడే వాళ్ళు ఆ మనుష్యుల వల్ల ఎన్నో బాధలకు గురవుతుంటారు. అలాగే ఉద్యోగాన్ని నమ్ముకున్న వాళ్ళు యజమానులవల్ల, తోటి ఉద్యోగులవల్ల ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు. అలాగే వ్యాపారాన్ని నమ్ముకొని బ్రతికేవాళ్ళు అందులో వచ్చే నష్టాలు, ఆర్థిక ఇబ్బందులవల్ల నష్టపోతుంటారు. అయిష్టంగానే, ఏడుస్తూనే ఉద్యోగమో, వ్యాపారమో చేస్తుంటారు. వాటివల్ల సంతోషంగా ఉండలేరు. మన చుట్టూ నివసించేవారు బాగా డబ్బు సంపాదించి, పెద్ద పెద్ద ఇళ్ళు కట్టించుకొని, కార్లలో తిరుగుతూ విలాసవంతమైన జీవితం గడుపుతుంటే వారితో పోటీ పడలేక అవమానంగా అనిపిస్తుంది. వారిలా డబ్బు సంపాదించడానికి ఎంతో తాపత్రయ పడుతుంటారు. ఈ లోకంలో తాము బ్రతకటానికి వారు ఎంచుకొనే మార్గంలో వారికి ఎన్నో అవమానాలు ఎదురవుతుంటాయి. ఒక్కొసారి ఆత్మహత్యలు కూడా చేసుకొనే పరిస్థితులు ఎదుర్కొంటారు. ఉద్యోగమో, వ్యాపారమో చేయడం దేవుని దృష్టిలో తప్పు కాదు గాని దేవుడు లేని వారి జీవితాలలో వారికి ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కోవడం వారికి కష్టంగా ఉంటుంది. ఇదంతా దేవున్ని నమ్మకపోవడం వలన కలిగే పరిస్థితి. దేవున్ని నమ్మినవాళ్ళు ఏ పని చేసినా సంతోషంగా చేస్తారు. ఎందుకంటే వారు వాళ్ళు చేసే పని మీద కాకుండా దేవుని మీదనే ఆధారపడతారు. దేవుడు తానే మనకు అభయం ఇస్తున్నాడు. నా కొరకు కనిపెట్టుకొనువారు అవమానము పొందరు అని. 'నీ ఆజ్ఞలన్నిటిని నేను లక్ష్యము చేయునప్పుడు నాకు అవమానము కలుగనేరదు' (కీర్తనలు 119:6) అని వ్రాయబడిన ప్రకారము మనం దేవునికి లోబడి ఆయన ఆజ్ఞలను, విధులను, కట్టడలను అనుసరిస్తున్నప్పుడు దేవుడు మనకు సంబంధించిన ప్రతి విషయములోను బాధ్యత తీసుకుంటాడు. అయితే దేవున్ని హృదయపూర్వకంగా నమ్మేవాళ్ళు చాలా తక్కువ. అసలు దేవుని దగ్గరకు రావడానికే మనిషికి ఇష్టం ఉండనప్పుడు, ఆ దేవుని కొరకు కనిపెట్టుకోవడమనేది అసాధ్యం. ఇంక ఏదో తప్పనిసరి పరిస్థితుల్లో వాళ్ళ అవసరాలు తీర్చుకోడానికి, రోగాలు పోవాలని, ఏదో ఒక మేలు జరుగుతుందనే ఆశతో అయిష్టంగానే దేవుని దగ్గరకు వస్తారు. షరతులు లేని దేవుని ప్రేమ, తన దగ్గరకు వచ్చిన ప్రతి ఒక్కరికి సమాధానాన్ని దయచేస్తుంది. అయితే తనను సృష్టించిన సృష్టికర్తయైన దేవున్ని హృదయపూర్వకంగా నమ్మిన వారి జీవితాలు సంతోష సమాధానాలతో గడచిపోతాయి. వారి జీవితం నల్లేరు మీద నడకలా సాగిపోతుంది. కాబట్టి నీవు ఎటువంటి పరిస్థితులలోనైనా దేవుని మీద ఆధారపడి, ఆయన కొరకు కనిపెట్టుకొని ఉంటే నీవు ఎలాంటి అవమానమును పొందకుండా దేవుడు నిన్ను కాపాడతాడు. మరి నీవు దేవుని మీద ఆధారపడి జీవించడానికి సిద్ధమా?

–కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**
**A/c No. 10957294340**

# జఫ్నత్పనేహు

**(యోసేపు జీవిత చరిత్ర)**

**– కొడవటికంటి**

యోసేపు చెరసాలలో చేరి ఇప్పటికి మూడు సంవత్సరాలు కావస్తుంది. ఫరో పుట్టినరోజు వేడుకలు ఇంకా నెల రోజులు ఉన్నాయి. ఈ నెల రోజులు కోట అంతా సందడిగా ఉంటుంది. పనివారికి, సైనికులకు, అందరికి దాదాపు అన్నివేళల్లో ఈ నెల రోజులు అన్నీ వసతులు కల్పించబడతాయి. ఒకరోజు మధ్యాహ్నం భోజనాలు ముగించిన తర్వాత సాయంకాలం మూడుగంటల నుండి కోటలో దాదాపు పదిమందికి ఆకస్మికముగా వాంతులు అయి అత్యవసర చికిత్సకు పంపబడ్డారు. సాయంకాలం ఆరు గంటలకు దాదాపు వందమందిదాక వైద్యశాలలో చేర్చబడ్డారు. ఫరోకు ఈ వర్తమానము వినబడింది. మధ్యాహ్నం భోజనాలలో ఏదో పొరపాటు జరిగింది. అది పానీయము వలన కాని, భోజన పదార్థాలలో కాని అశ్రద్ధ జరిగి ఉంటుంది. కనుక పానదాయకుల అధికారిని, భక్ష్యకారుల అధికారిని విచారణ పూర్తి అయ్యే వరకు రాజుగారి ఖైదీలను ఉంచే చెరసాలలో వేశారు.

అది యోసేపు ఉన్న చెరసాల. ఎంతో సంతోషకరమైన రోజులలో ఇటువంటి సమయంలో చెరసాల పాలు కావటం బహు దుఃఖకరమైన విషయం. ఎన్నో రకాలైన బహుమతులు పొందవలసిన రోజులు. తప్పు ఎవరిదో తెలుసుకోవటం అంత తేలికైన పనికాదు. ఎందుకంటే పానదాయక అధికారి క్రింద దాదాపు నూట ఇరవై మంది పనివారు ఉంటారు. వీరు రకరకములైన పానీయాలు తయారుచేసి, రాజుగారి భోజన బల్లవద్దకు పంపుతారు. వాటిని పానదాయకుడు పరీక్షించిన తర్వాత రాజుగారి భోజనబల్ల పైకి పానానికి అనుమతిస్తారు. అదే విధముగా భక్ష్యకారుల అధికారి క్రింద రెండు వందలమంది పనివారు ఉంటారు. వారు రకరకాలైన భక్ష్యములు తయారు చేసి, భక్ష్యకారుడు పరీక్షించిన తర్వాతనే వాటిని రాజుగారి భోజన బల్లపైకి వడ్డించుటకు అనుమతిస్తారు. ఇంతమందిలో ఏ పనివాడు తప్పు చేసినా వారి అధికారిదే బాధ్యత. మధ్యాహ్నం రాజుగారితో కలసి భోజనం చేసిన వారిలో దాదాపు వందమంది అస్వస్థులైనారు కనుక పానదాయకుల, భక్ష్యకారుల అధికారులను యోసేపు ఉన్న చెరసాలలోనే వేశారు. యోసేపు వారిద్దరినీ బహుగా ఆదరించాడు. వారి ఇంటి యొద్ద నుండి ఎవరైనా చూడవస్తే, తన బాధ్యత మీద అనుమతించేవాడు. ముఖ్యంగా పానదాయకుడు మంచివానిగాను, దైవభీతిగల వానిగాను కనిపించాడు. అతనిని ఎక్కువగా ఆదిరించేవాడు. ఈ మూడు సంవత్సరాలలో అనేకులు ఇటువంటివారు ఈ చెరసాలలో చేర్చబడ్డారు. కొంతమంది విచారణ అనంతరం తిరిగి ఉద్యోగాలలోకి వెళ్ళారు. కొంతమంది సమాధులలోకి వెళ్ళారు. అందువలన యోసేపు ఎవరి గతి ఎలాగ ఉంటుందోనని అందరిని ప్రేమగా చూసేవాడు.

మూడు సంవత్సరాలు గడిచిపోతున్నాయి. ఈ చెరసాల సొంత ఇల్లులా అయిపోయింది. తన తండ్రి, అన్నలు, వియాన్, పోతీఫరు, యాజమానురాలు, అక్షాపు అందరూ పాతబడిపోయిన కలలాగా అయిపోయారు. కానీ ఆసెనతు. ఆసెనతు అనగానే గుండె ఆగి మళ్లీ కొట్టుకుంటుంది. ఎప్పుడైనా స్థిరంగా ఆగిపోతే బాగుండును అనుకుంటాడు. ఆసెనతు కొరకైన ఆలోచన మాత్రమే తనని ఈనాడు జీవింప చేస్తుంది. ఎప్పుడైనా ఎవరికి చెప్పకుండా ఆసెనతు దగ్గరకు పరుగెత్తుకుని వెళ్ళాలనిపిస్తుంది. ఆనాడు నైలునది ఒడ్డున నిలబడి కన్నీళ్ళు కారుస్తున్న ఆసెనతు కాళ్ళ దగ్గర ఇసుకలో కూర్చున్న విధంగా, ఒక్కసారి కూర్చుని ఆసెనా చిన్న గడ్డంమీద నుండి ఆ కళ్ళు చూడాలనిపిస్తుంది. మొదటిసారి రథం తలుపులు తెరచి యజమానురాలిని ఆహ్వానించటానికి చెంగు చెంగున ఎగురుతూ వచ్చిన ఈ లేడిపిల్లేనా, ఇంతలా తన కొరకు కన్నీరు కార్చింది? అనుకున్నాడు. ఇంతకు ముందు తన కొరకు తన ఎదురుగా ఎవరూ కన్నీరు కార్చలేదు. అసలు ఎవరైనా

మనిషిని ఎదురుగా పెట్టుకొని ఎందుకు ఏడుస్తారు? ఎంత తియ్యని బాధ. ఆసెనతు, ఆ పేరులోనే మాధుర్యం. ఆసెనతు ఆ పేరులోని ప్రతి అక్షరం ఒక అందమైన ఆకారం. ఓ అందమైన ఆలాపన. మధురమైన భావన. ఇలా తలచుకొని తలచుకొని కొంత కాలానికి ఆసెనత్ అంటే ఒక అందమైన కలలా మిగిలి పోతుందేమో! అని అనిపించి భయమేసింది. ఎంతసేపు ఆలోచించాడో తెలియదు. ఆసెనతు ఆలోచన ఎక్కువసేపు సాగితే ఆ పూట ఇక ఆహారం మీద ఆశ ఉండదు. రెండు మూడు రోజులు జబ్బు పడినట్లుగా అనిపిస్తుంది.

ఆ రాత్రి ఆలస్యంగా నిద్రపోయాడు. ఆసెనతు కలలోకి రాకూడదా? అని చాలాసార్లు అనుకున్నాడు. కాని ఒక్కసారి కూడా కలలోకి రాలేదు. ఉదయం నిద్ర లేచేటప్పటికి పొద్దుపోయింది. ఖైదీలకు ఉదయాహారం ఇవ్వటం అయిపోయింది. వంటచేసే సనీరు తన దగ్గరకు వచ్చి, "ఈరోజు రాజుగారి క్రొత్త ఖైదీలు ఏమి తినలేద"ని చెప్పి వెళ్ళిపోయాడు. యోసేపు చిన్నగా పనులన్నీ ముగించుకొని నడుస్తూ ఖైదీలను చూస్తుంటే, క్రొత్త ఖైదీలు ఇద్దరూ విచారంగా మాట్లాడుకుంటున్నారు. యోసేపును చూస్తూ పానదాయకుడు సన్నగా నసిగాడు. ఆయన అందరిలో పెద్దవాడు. అరవై సంవత్సరాలు ఉండవచ్చు అనుకున్నాడు.

"ఏమిటి ఉదయం భోజనం చెయ్యలేదని తెలిసింది? ఇప్పుడైనా భోజనం చెయ్యరా?" అని అడిగాడు.

పానదాయకుడు విచారంలో ఉన్నాడు. దుఃఖ స్వరంతో "మేము ఇద్దరం కలలు కన్నాము. వాటి భావం చెప్పగలిగేవారు ఎవరూ లేరు" అని చెప్పాడు.

"భావములు చెప్పుట దేవుని ఆధీనం కదా!" అని అంటూ తన కలలు తనను నాశనం చేశాయి. తనకి చిన్నతనంలో వచ్చిన రెండు కలలు తన అన్నలకు బహు కోపకారణాలయి తనను ఈ చెరలోకి తెచ్చాయి. తన తండ్రికి కలవస్తే దేవుడు కనిపించి ఆదరించాడు. ఒకరి కల దుఃఖము, మరొకరి కల సంతోషదాయకమని, 'దేవా! వీరి కలల వలన ఇద్దరికి సంతోషం కలిగించు' అని మనసులో అనుకున్నాడు. "మీరు దయచేసి అ కలలు నాకు వివరించి చెప్పండి" అని అడిగాడు యోసేపు.

పానదాయకుడు భయపడుతూనే "ద్రాక్షవల్లి నా ఎదురుగా ఉంది. దానికి మూడు తీగలు. అది చిగురించినట్లుగా ఉంది. దాని పువ్వులు వికసించాయి. దాని గెలలు పండి ద్రాక్షఫలాలయ్యాయి. మరియు ఫరో గిన్నె నా చేతిలో ఉంది. ఆ ద్రాక్షఫలాలు నేను పట్టుకొని ఫరో గిన్నెలో వాటిని పిండి ఆ గిన్నె ఫరో చేతికిచ్చాను" అని చెప్పాడు.

అప్పుడు యోసేపు దాని భావమిదే – "ఆ మూడు తీగలు మూడు దినములు. ఇంకా మూడు దినములలో ఫరో నీ తలను పైకెత్తి నీ ఉద్యోగం మరలా నీకిప్పిస్తాడు. నీవు అతనికి పానదాయకుడవై ఉన్ననాటి మర్యాద చొప్పున ఫరో గిన్నెను అతని చేతికి అప్పగిస్తావు" అన్నాడు.

అప్పుడు భక్ష్యకారుల అధిపతి 'పానదాయకునికి శుభమైన సమాచారం వచ్చింది. కనుక తనకి అట్లాగే జరుగుతుంది' అని సంతోషంగా యోసేపు ప్రక్కన కూర్చున్నాడు. థేమాను, ముక్తారు ఇంకా సనీరు కూడా కూర్చుని ఉన్నారు. యోసేపు చెప్పమన్నట్లుగా చూసాడు. భక్ష్యకారుల అధిపతి తనకు రాత్రి వచ్చిన కలను మళ్ళీ జాగ్రత్తగా నెమరు వేసుకుంటున్నాడు.

"తెల్లని పిండివంటలు గల మూడు గంపలు నా తలమీద ఉండెను. మీది గంపలో ఫరో నిమిత్తము సమస్తమయిన పిండివంటలు ఉండెను. పక్షులు నా తలమీదనున్న ఆ గంపలో నుండి వాటిని తీసుకొని తినుచుండెను" అని చెప్పాడు. అందుకు యోసేపు ఆ కల భావమిదే, "మూడు గంపలు మూడు దినములు. ఇంకా మూడు దినములలోగా ఫరో నీ మీద నుండి నీ తలను పైకెత్తి మ్రాను మీద నిన్ను వ్రేలాడదీయిస్తాడు" అని అన్నాడు.

భక్ష్యకారుల అధిపతి ఆ మాటలువిని అదిరిపడ్డాడు. "నా తల ఎందుకు తీస్తాడు? ఆ విధంగా ఏమి జరుగదు. అదీకాక ఇంకా మూడు రోజులలో ఫరో పుట్టినరోజు కనుక

ఆ రోజు ఫరో అస్సలు అలా చెయ్యడు" అన్నాడు. యోసేపు ఏమి మాట్లాడలేదు. అతనిలో ఏదో ఆశాకిరణం వెలిగింది. ఆరిపోయిన దీపం మళ్ళీ కాంతివంతమవుతుంది. తను చెప్పిన కల భావము తప్పక నెరవేరుతుంది. ఫరోకి దగ్గరలో ఉండే వ్యక్తి, ఎల్లప్పుడు ఫరో ముఖం చూడగలిగిన వ్యక్తి మాత్రమే తన యొక్క సంగతి ఫరోకి చెప్పగలడు అని అనుకుంటూ, పానదాయకుని గదికి వచ్చి, అతని ప్రక్కనే కూర్చున్నాడు.

"ఫరో నీ తలను పైకెత్తి నీ ఉద్యోగం నీకిస్తాడు. నీవు మరలా రాజునకు గిన్నెను అందిస్తావు, కనుక నాది ఒక మనవి" అని అన్నాడు యోసేపు.పానదాయక అధికారికి ఆశ్చర్యం వేసింది. యోసేపును తను ఈ చెరసాలలో చేర్చబడిన నాటి నుండి గమనిస్తూనే ఉన్నాడు. అతను ఎల్లప్పుడు ఇతరుల అవసరాల గురించి ఆలోచిస్తుంటాడు. చివరికి ఈ రోజు ఉదయం నుండి భక్ష్యకారుల అధిపతి, తను చింతాక్రాంతులై యుండగా తనంతట తాను వచ్చి, తమ కలల భావాలు చెప్పి తృప్తిపరచినవాడు. అతనికి కూడా అవసరతలు, బాధలు ఉంటాయని తనే కాదు, ఈ చెరసాలలో ఉన్న ఎవ్వరూ ఆలోచించరు. మరుగునపడి మరణాసన్నులైన ఖైదీలను కూడా బయటకు తెప్పించి, వైద్యానికి పంపించే వాడు అనుకొని "చెప్పండి. మీకొరకు నా ప్రాణమైనా పెడతాను. రాజుగారితో ఏదైన మనవి చేయాలా? లేక యాజకునితో అంటే ఓను యాజకునితో మీ తరుపున ఏమైనా పూజలు చేయాలా?" అని అడిగాడు.

"మీకు ఓను యాజకులు పోతీఫెర తెలుసా?" అని అడిగాడు. యోసేపు ఆతృతగా. అతని ముఖం అంత తొందరగా ప్రకాశించటం చూసి, ఆలోచనలో పడ్డాడు. పానదాయకుడు. "ఓను యాజకుడు పోతీఫెర రాజుగారి ఆస్థానంలోని ముఖ్యులందరికీ తెలుసు" అన్నాడు. "వారి కుటుంబ సభ్యులు తెలుసా?" అడిగాడు యోసేపు.

"అందరు తెలుసు. ఆయన భార్య నిమోని, కుమారుడు ఇనిస్, కుమార్తె ఆసెనతు అందరూ తెలుసు" అన్నాడు. అంతే యోసేపు ఇక ఏమి మాట్లాడలేదు.

పానదాయకుడే "చెప్పండి! యాజకునితో ఏదైనా చెప్పాలా?" అని అడిగాడు.

యోసేపు గొంతు సవరించుకొని "నీకు క్షేమము కలిగినప్పుడు నన్ను జ్ఞాపకం చేసుకొని, నా యందు కరుణ ఉంచి, ఫరోతో నన్ను గూర్చి మాటలాడి, ఈ చెరసాలలో నుండి నన్ను బయటకు రప్పించుము. ఏలయనగా నేను హెబ్రీయుల దేశము నుండి దొంగిలబడ్డాను అది నిశ్చయము. మరియు ఈ చెరసాలలో నన్ను వేయుటకు ఇక్కడ సహా నేనేమియు చేయలేదు" అని అన్నాడు.

పానదాయకుడు జాగ్రత్తగా విన్నాడు. యోసేపు భుజం మీద చెయ్యివేసి, "యోసేపూ భయపడకు. నేను రాజును చూసిన రోజుననే నీ విషయము చెప్పి నిన్ను ఇక్కడి నుండి బయటకు వచ్చేటట్లు చేస్తాను" అని యోసేపు చెయ్యి తన చేతిలోకి తీసుకొని ప్రమాణం చేస్తూ, "మరి యాజకుడైన పోతీఫెరకు ఏమి చెప్పాలి?" అన్నాడు. **(సశేషం)**


**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా**
**చందా పంపించాలంటే**
**ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

సీరియల్

# నా చిత్తానుసారుడు

24

(దావీదు జీవిత చరిత్ర)

– కొడవటికంటి

"దావీదు అరణ్యంలో నుండి మన యజమానుని కుశల ప్రశ్నలడుగుటకై, దూతలను పంపించగా అతడు వారితో కఠినముగా మాటలాడెను. అయితే ఆ మనుష్యులు మాకెంతో ఉపకారం చేసియున్నారు. మేము పొలంలో వారి మధ్యను సంచరిస్తున్నంతసేపు, అపాయంగాని నష్టం కాని మాకు సంభవించనే లేదు. మేము గొఱ్ఱెలను కాస్తున్నంతసేపు వారు రాత్రింబవళ్ళు మా చుట్టు ప్రాకారంగా నుండిరి. అయితే మా యజమానునికి అతని ఇంటి వారందరికిని వారు కీడు చేయ నిశ్చయించి యున్నారు గనుక ఇప్పుడు నీవు చేయవలసిన దానిని బహుజాగ్రత్తగా ఆలోచించుము" అని బయటకి వస్తూ తిరిగి వెనక్కి వెళ్ళి "మన యజమానుడు బహు పనికి మాలినవాడు ఎవనిని తనతో మాట్లాడ నీయడు" అని వెళ్తుంటే...

"హనాను నీవు ఇక్కడ వుండు" అని అంది.

"యజమానుడు..." అని అన్నాడు

"అతనికేమీ చెప్పనవసరం లేదు. నీవు నాతో రావాలి" అని... "శైలుబైకి చెప్పి త్వరగా రెండవందల రొట్టెలు బుట్టలో కట్టమను, గేషానుతో అయిదు గొఱ్ఱెల మాంసం వేయించి కట్టించమను, మోజనును ఐదు మానికల ధాన్యము వేయించి కట్టమను, గాజేజును నూరు ద్రాక్షా గెలలను, రెండు వందల అంజూరపు ఆడలను గార్ధభాల మీద కట్టమను తొందరగా" అని ఇంట్లోకి వెళ్ళి రెండు ద్రాక్షారసపు తిత్తులను తీసి హోరేపుకు ఇచ్చి వాటిని ద్రాక్షారసంతో నింపి గాడిదకు కట్టమని చెప్పి తాను స్నాన వాటికకు వెళ్ళిపోయింది.

ఒక గంట తర్వాత ఎనిమిది గాడిదలు బరువుతో సిద్ధంగా వాకిలి వద్దనున్నవి హనానుతో మీరు నా కంటే ముందుగా పోవుడి నేను మీ వెనుక నుండి వచ్చెదనని చెప్పి తనకు అలవాటైన గాడిద మీద కూర్చుని హోరేపు ముందు పరుగెడుతుంటే ఇంటి వెనుక భాగం గుండా పర్వతం తట్టు బయలుదేరింది అబీగయీలు.

యాషాబాను చెప్పిన మాటలు తనతో ఉన్నవారందరూ విన్నారు. దావీదు మనస్సులో ఏముందో అది ఎవరు ఊహించలేకపోతున్నారు. తన బద్ధశత్రువైన సౌలు తన చేతికి చిక్కినప్పుడు చేతులారా వదలిపెట్టిన వాడు కదా అనుకున్నారు.

నాబాలునకు కలిగిన దానినంతటిలో ఏదియు పోకుండ ఈ అరణ్యంలో అతని ఆస్తి అంతయు నేను వ్యర్థంగా కాయుచు వచ్చితిని అని తనలో తాను అనుకుంటు న్నట్లుగా అన్నాడు. మరలా ఉపకారమునకు నాకు అపకారము చేసియున్నాడే అని.

అతనికున్న వారిలో ఒక మగపిల్లవానినైననూ తెల్లవారునప్పటికి నేనుండ నియ్యను. లేదా దేవుడు మరి గొప్ప అపాయం దావీదు శత్రువులకు కలుగ జేయునుగాక అని తన కుడిచెయ్యి ప్రమాణం చేస్తున్నట్లుగా చాపినప్పుడు అనుచరులందరూ ఉలిక్కిపడ్డారు.

"మీరందరూ మీ కత్తులు ధరించుకొనుడి" అని బిగ్గరగా చెప్పి తన నడుముకు కత్తి కట్టుకొని గుఱ్ఱము ఎక్కి అబీషైతో "నాలుగు వందలమంది చాలు" అన్నాడు దావీదు.

"గాడిదను తొందరగా తోలమని" అంది. తన చూపు ఎంతదూరం చూడగలదో నలుదిక్కుల కళ్ళు త్రిప్పుతూ చూస్తున్నది తలమీద ముసుగుగాలికి లేచిపోయిన సంగతి కూడా పట్టించుకోలేదు. ఇంటి వెనుక వైపు నుండి బయటకి రాగానే చిన్న పర్వతం వెనుక వైపుగా చుట్టుకొని పెద్దపర్వతం వైపుగా గాడిద మళ్ళింది. ఇప్పుడు తన గ్రామంలోనుండి కాక చుట్టు తిరిగి మామూలు బాటలో ప్రవేశించింది. దూరంగా హానాను పనివారు బరువులతో గాడిదలు కనిపించాయి.

వాటిని దాటి వెళ్తూ హనానుతో "నేను ముందు వెళ్తుంటాను" అని గాడిదను కొంచెం అదిలించింది. హోరేపు గాడిద ముందు తన వేగం పెంచి పరుగెడుతున్నాడు.

పెద్ద పర్వతం దగ్గరకి వచ్చినప్పుడు లోయలో నుండి ఎర్రని దుమ్ము ఆకాశానికి ఎక్కటం కనిపించింది. అబీగయీలుకి తన గుండె శబ్దం తనకి వినిపిస్తుంది. లోయలోకి వస్తుండగా దావీదును అతని అనుచరులు ఎదురుపడ్డారు ఆమె తన గాడిదను దిగి నిలబడింది.

దావీదు ఆమె దగ్గరికి వచ్చినప్పుడు ఆమెను ఇంతకు ముందు ఎన్నడును చూచి యుండలేదు కాని ఆమె తన కొరకు గాడిదను దిగి నిలుచున్నదని గ్రహించాడు. ఎవరీమె? అనుకున్నాడు. ఆమె తన దగ్గరకి వస్తుంది ఆమె బహు దుఃఖంలో ఉన్నట్లు కనబడుతుంది. ఇంత చిన్న వయస్సులో ఇంత చక్కని యౌవనురాలు?

తాను వెళ్తున్న కార్యము ఆగటానికి వీలు లేదు మరలా గుఙ్భం దగ్గరకు వెళ్తుంటే ఆమె సాష్టాంగ నమస్కారం చేస్తుంది. ఆమె లేచి పరుగునవచ్చి తన కాళ్ళు పట్టుకొని నప్పుడు ఎవరీ అమ్మాయి? ఆమె బహుగా కృంగి ఉన్నది అయినా ఆమెలో ఉన్న కార్యదీక్ష ఆమె కళ్ళలో కనబడుతుంది. చిన్నవయస్సులోనే లోకమంతా తెలిసిన దానిలా ఉంది.

తన పాదములు రెండూ రెండు చేతులతో పట్టుకొని నప్పుడు అవి చేతులులాగ లేవు. మెత్తని దూదివలె వుంది. తనకు తెలియకుండానే తన హృదయం మెత్తబడుతున్నది అయినా ఆ సంగతి బయటపడకూడదు. ఈమె ఎవరు? ఆమె అలానే కాళ్ళు పట్టుకొని తలపైకెత్తినప్పుడు ఆ గుండ్రని కళ్ళు నిండుగా నీరు నిండి ఉంది. ఈమెను ఇంతగా బాధించిన వాడెవడు అని కోపం వచ్చింది. నిన్ను ఇంతగా బాధించినదెవరు? అని అడగాలనుకున్నాడు.

ఆమె తల పైకెత్తి దావీదును చూచినప్పుడు తానూహించినట్లుగా లేదు. చాలా మృదువుగా ఎర్రగా ఇంతలేసి కన్నులు దేవుడు ఆడపిల్లగా సృష్టించి చివరలో మనస్సు మార్చుకోని మగవానిగా పుట్టించిన వానివలె వున్నాడు. అతని ముఖం చూచిన తర్వాత తన మనస్సు తన స్వాధీనంలోనికి వచ్చింది. తలవంచుకొనినప్పుడు ఆమె కురులు ఆమె ముఖమును కప్పినవి. తన పాదాల మీద వేడి నీటి బొట్ల స్పర్శ తగిలింది. కొంచెం వెనక్కి జరిగి "అమ్మాయ్" అన్నాడు దావీదు. గొంతు కొంచెం కరువుగా ఉంది.

ఆమె తలెత్తి దావీదు ముఖంలోకి చూసినప్పుడు ఇంతకు ముందున్న భయంలేదు. కఠినుడు కాదు అన్న భావన మెదిలింది. "నా యేలినవాడా!" అంది అబీగయీలు చిన్నగా. ''ఈ దోషము నాదని ఎంచుము నన్ను మాటలాడనీయుము'' అంది. అబీషై ప్రక్కగా వచ్చి నిలుచున్నాడు. దావీదు అబీషైని చూచాడు. హృదయం ప్రశాంతమైంది.

''నా యేలినవాడా! దుష్టుడైన ఈ నాబాలును లక్ష్యపెట్టవలదు" అయితే ఈమె నాబాలు కుమార్తె కాదు. ఏ ఇశ్రాయేలీయురాలు అందులో యూదా గోత్రికురాలు తండ్రిని అలా మాట్లాడదు. ఈమె ఎవరు?

"అతని పేరు అతని గుణములను సూచించుచున్నది. అతనిపేరు నాబాలు. మోటుతనం అతని గుణము. నా యేలినవారు పంపించిన పని వారు నాకు కనపడలేదు".

అప్పుడు అర్థమైంది. ఈమె ఆ ఇంటి యజమానురాలు అతని భార్య. దావీదు హృదయం ద్రవించింది. ఏదో చెప్పాలని నోరు తెరచాడు. "నా యేలినవాడా!" అంది నన్ను మాట్లాడనిమ్ము అన్నట్లుగా ఉంది.

"యెహోవా జీవముతోడు, నీ జీవముతోడు" అన్నప్పుడు ఆమె తల మీద తన చెయ్యి వుంచాడు. యెహోవా పేరు ఎత్తిన వారు ఎప్పటికి శిక్షార్హులు కారు.

"ప్రాణహాని చేయకుండా యెహోవా నిన్ను ఆపి యున్నాడు" అని అంది. "యెహోవా పంపిన మనిషి ఈమేనా?" అనుకున్నాడు. నిజంగా యెహోవా నిర్దోషులను సంహరించడు. కాని తాను నాబాలునే కాక నిర్దోషులను కూడ చంపెదనని యెహోవా నామమున ప్రమాణం చేసి యున్నాడు. **(సశేషం)**



# 'నాణెమైన జీవితం'



మీరు కరెక్ట్‌గానే చదివారులేండి నాణ్యమైన జీవితం కాదు, నాణెమైన జీవితమే. నాణేనికి బొమ్మా బొరుసు ఎలా ఉంటాయో ప్రతి మనిషి జీవితంలో కూడా బొమ్మా బొరుసు ఉంటాయి. కనబడే మనిషి బొమ్మ అయితే కనబడని మనిషి బొరుసు. నాణెము యొక్క ఆకారాన్నిబట్టి, సైజునిబట్టి కళ్ళు మూసుకొని అయినా సరే అది ఏ నాణెమో చెప్పగలము కానీ, కనబడే మనిషి యొక్క రూపురేఖలనుబట్టి, ఎత్తునుబట్టి, లావునుబట్టి ఆ మనిషి ఎలాంటివాడో చెప్పడం చాలా కష్టం. కరెక్టుగా చెప్పాలంటే ఒక మనిషిని నూరుశాతం అంచనా వెయ్యడమంటే చూస్తూ చూస్తూ తప్పులో కాలెయ్యడమే. మెరిసేదంతా బంగారం కాదనేది ఎంత నిజమో మనిషిని చూచి ఒక అంచనాకి రాకూడదనేది అంతే నిజం. ఎంతపెద్ద మేధావైనా సరే ఎదుటి మనిషిని నూరుశాతం అంచనా వేశాడంటే వాళ్ళు దేవునితో సమానమే. ఎందుకంటే దేవుడు తప్ప ప్రపంచంలో ఏ మనిషి కూడా ఇంకో మనిషిని అంచనా వెయ్యలేరు. ఎవరితోనైనా మనం మాట్లాడేటప్పుడు వాళ్ళు మంచోళ్ళనో, చెడ్డోళ్ళనో వారి గురించి ఏదో ఒక అభిప్రాయానికి వస్తాము కానీ, వారి అంతరంగము అందుకు భిన్నంగా ఉండోచ్చు. అందుకు నిదర్శనం, 'అరె, వాళ్ళు చాలా మంచోళ్ళు అనుకున్నానే' అనో, 'ఛ, వాళ్ళని తప్పుగా అనుకున్నాను' అనో అనుకున్నప్పుడు మన అంచనా తప్పు అనే కదా అర్ధము. ముందు మన అంచనా ఎలా తప్పు అయ్యిందో, తరువాత అంచనా కూడా తప్పు అవ్వొచ్చు. ఎందుకంటే మనుష్యులు పరిస్థితులకు తగినట్టుగా మారడం సర్వసాధారణం. దేవున్ని నమ్మి, ఆయన మీద ఆధారపడి జీవించేవారు మాత్రం పరిస్థితులనుబట్టి కాక దేవున్నిబట్టి జీవిస్తారు. వారు యథార్ధహృదయము కలిగి ఉంటారు. బయటికి ఒకలా, లోపల ఇంకోలా 'నాణెమైన జీవితం' కాకుండా నాణ్యమైన జీవితం జీవిస్తారు. 'మీరు సున్నము కొట్టిన సమాధులను పోలియున్నారు. అవి వెలుపల శృంగారముగా అగపడునుగాని లోపల చచ్చినవారి యెముకలతోను సమస్త కల్మషముతోను నిండియున్నవి' (మత్తయి 23:27). దేవున్ని ఎరుగనివారు యేసుప్రభువు చెప్పినట్లు సున్నంకొట్టిన సమాధుల్లా జీవిస్తారు. సమాధులు గ్రానైట్ రాయితో చాలా అందంగా కట్టిస్తారు, లోపల మాత్రం పురుగులు, ఎముకలు ఉంటాయి. అలాగే చాలామంది పైకి చాలా నీతిమంతులుగా, మా కంటె మంచివాళ్ళు ఇంక లేరన్నట్లుగా కనిపిస్తారు. వారి వ్యక్తిగత జీవితం మాత్రం ఇందుకు భిన్నంగా ఉంటుంది. లోపల కుళ్ళు, కుతంత్రాలతో, అసూయ, ద్వేషాలతో ఉంటారు. మేకప్ వేసుకున్నప్పుడు అందంగా కనిపించేవారు మేకప్ తీసివేసాక ఎంత అసహ్యంగా కనిపిస్తారో అలాగే ఉంటుంది. దూరపు కొండలు ఎంత నున్నగా కనబడతాయో, దగ్గరకు వెళ్ళే కొద్ది ఎన్ని గుంటలు మెట్టలు ఉంటాయో వారి వ్యక్తిగత జీవితం కూడా అలానే ఉంటుంది. మేక వన్నె పులి, గొఱ్ఱె చర్మం కప్పుకున్న తోడేలులాంటి వారిని కనిపెట్టాలంటే దేవుని సహాయం లేనిదే వారిని కనిపెట్టడం మనకి అసాధ్యం. దేవుడు మనుష్యులను యథార్ధంగా పుట్టించాడు కానీ, మనుష్యులు అనేకరకాలైన తంత్రాలు ఏర్పరచుకొని యథార్ధంగా ఉండలేక పోతున్నారు. దేవుడు మనుష్యుల నుండి యథార్ధత ఆశిస్తాడు. మనుష్యులు మాత్రం వారి చుట్టూ ఉన్నవారిని మెప్పించడం కోసం పైకి నీతిమంతులుగా, లోపల దేవుని దృష్టికి అసహ్యమైన జీవితం జీవిస్తుంటారు. మనం పైకి బొమ్మలా, లోపల బొరుసులా ఉండే **'నాణెమైన జీవితం'** కాకుండా నాణ్యమైన జీవితం జీవిద్దాము.

**ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు**

**9 4 4 0 2 1 7 7 2 6**

# మధ్యకాలము

తిమోతియస్ కూడా ఈ జయశాలి నుండి పారిపోయి అసమాధానములో ఉండి 1,20,000మంది సైన్యమును, 2500 గుఱ్ఱములను సమకూర్చి గిలాదులోనున్న యూదులను హతమార్చుటకై బయలుదేరెను. కాని ఈ వార్త యూదాకు తెలిసిన వెంటనే అతని మీదకు యుద్ధమునకు బయలుదేరెను.

తరువాత యూదా తిరుగులాడుచున్న అరబ్బులలో అనేకమందిని ఓడించి వారితో సంధిచేసుకొనెను. రూబేను గోత్రములోనున్న కాస్పిస్ అను హెస్బోను పట్టణమును తీసికొని అందులో నివసించేవారిని కత్తితో హతము చేసి ఆ స్థలమును నాశనము చేసి కరాసా పట్టణమును కూడ పట్టుకొని అందున్న కోటలోని 10,000 మందిని కత్తితో హతముచేసెను. అతడు తిమోతియస్‌తో కలసివచ్చి అతనితో యుద్ధము చేసి అతని ప్రజలలో 30 వేలమందిని హతము చేసి అతనిని బంధించి మిగిలిన సైన్యమును అరేబియాలో నున్న కార్నియోన్ పట్టణము వరకు వెంటాడి ఆ పట్టణమును కూడా తీసికొని తిమోతియస్ సైన్యములో నుండి 25 వేలమందిని హతమార్చెను. కాని అతని పరిపాలన ప్రాంతంలో ఉన్న యూదులందరిని విడుదల చేయుదునన్న వాగ్ధానముతో తిమోతియస్‌ను ప్రాణముతో విడిచి స్వతంత్రునిగా చేసెను.

అతడు యెరూషలేమునకు తిరిగి వచ్చుచు లిసియాస్ ద్వారా యుద్ధసైన్యముతో నింపబడిన ఎఫ్రాన్ అను బలమైన పట్టణమును ధ్వంసం చేసెను. 25 వేలమందిని హతమార్చి దానిని కొల్లపెట్టి నేలపాటు చేసెను. ఎందుకనగా ఆ పట్టణముగుండా అతడు వెళ్ళుటకు వారు నిరాకరించిరి. ఈ దండయాత్ర యెరూషలేము ఆలయమందు కృతజ్ఞ తారాధనతో ముగింపబడెను. ఆ విధముగా యూదా తన విరోధుల వలన శాంతిని కోల్పోయి ఇదూమియా దక్షణ భాగము వరకు యుద్ధములు కొనసాగించెను. ఆ ప్రాంతమునకు దగ్గరగానున్న ముఖ్యపట్టణమైన హెబ్రోనును ధ్వంసము చేసెను. ఆ తర్వాత ఫిలిష్తీయుల ప్రాంతమునకు వచ్చి అష్టోర్ పట్టణమును పట్టుకొని వారి విగ్రహములను నాశనము చేసి వారి దేశమును దోచుకొనెను. తర్వాత సిరియారాజు ఆధీనములో నున్న అక్రా కోటలోని సైనికులు యుద్ధకాల మందు ఆలయమును కాపాడిన వారికి సమస్యగా యుండిరి గనుక వారిని చంపుటకై తిరిగి యూదయకు వచ్చెను.

యూదా క్రమముగా ముట్టడి వేయుటకు సిద్ధపడెను. అంతియోకస్ ఆ అక్రా పట్టణము నాశనము చేయబడుటను గూర్చి తెలిసికొని దానిని రక్షించుటకై లక్ష కాల్బలముతోను, 20వేల గుఱ్ఱములతోను, 32 ఏనుగులతోను, 300 యుద్ధాయుధములు కల్గిన రధములతోను బయలుదేరి ఇదూమియగుండా వెళ్ళుచూ బెత్సురా ప్రాంతమును ముట్టడి వేసి చివరకు లోపరచుకొనెను. ఆ తర్వాత యూదా ఆ పట్టణమును విడిపించుటకై రాత్రివేళ ఆశ్చర్యరీతిలో 4000 మంది శత్రువులను చంపెను. ఆ యుద్ధములో యూదా తన తమ్ముడైన ఎలియాజరును కోల్పోయెను. మరియు అతడు ఏనుగుతో పొడవబడి మరణమగునట్లు త్రొక్కబడెను. గనుక యూదా తన స్నేహితుల బలవంతముపై విశ్రాంతి తీసుకోవలసి వచ్చెను.

ఈ సిరియా సైన్యమందు రాజును లిసియాస్‌ను ఉండి యూదాను లొంగిపొమ్మని బలవంతము చేసిరి. ఎపిఫనేస్ తన మరణపడక మీద తన కుమారునికి రక్షక భటునిగా నియమించిన ఫిలిప్పు అంతియొకనన్ను ముట్టడి వేసి సిరియా సామ్రాజ్యము యొక్క ప్రభుత్వ భారములను తీసికొనుటకై వారు లేని సమయమును అవకాశముగా తీసి కొనెను. ఈ వార్త వినిన లిసియాస్ తక్షణమే గౌరవనీయమైన అవకాశములతో కూడిన పదములతో యూదయ దేశమును పాలించు యూదాతో సమాధానపడెను.

**(సశేషం)**

సాక్ష్యము

# ఖుద్దూస్



జీవము గల అతిపరిశుద్ధ యేసుప్రభువు ఘన నామము నకు స్తుతి స్తోత్రములు. పాపినైన నన్ను కరుణించి తన ఉచిత రక్షణ నాకు అనుగ్రహించినందుకు ఆయనకు నా కృతజ్ఞతలు, సజీవ వాక్యముతో నన్ను తృప్తి పరచి జీవ మార్గములో తన అదృశ్యహస్తమును అందించి నడిపించు చున్న అద్వితీయ దేవుని బంగారు పాదములకు నా వందనములు తెలుపుకొనుచున్నాను.

**నా సాక్ష్యము**

ఒకనాటి అన్యుడనైన నేను దేవుని బిడ్డలైన మీతో నా సాక్ష్యము పంచుకొనుట నాకు మేలు, ప్రభువుకు మహిమ, నా సాక్ష్యము కొందరి హృదయములను స్పర్శించి మేలు కలుగవలెనని నా ప్రార్థన, ఇది దేవుని చిత్తమని, నా సాక్ష్యము చదివిన వారు విన్నవారు ప్రతి ఒక్కరు తమ పాపములను ఒప్పుకొని ప్రభువు కొరకు జీవించవలెనని నా ఆశ.

నేను నెల్లూరు జిల్లా సర్వేపల్లి అనే కుగ్రామములో ఇస్లాం కుటుంబికులైన షేక్. అబ్దుల్ కాలేషా, హుసేన్ బీబి అను దంపతుల గర్భమున 1939 వ సం॥ము జూన్ మాసము మొదటి తేదిన జన్మించితిని. నాకు జన్మనిచ్చిన నా తల్లి తండ్రి నాకు షేక్ అబ్దుల్ ఖుద్దూస్ అను నామ కరణము చేసియుండిరి. 1950 ఏప్రిల్ మాసము వరకు సదరు గ్రామ పాఠశాలలో అయిదవ తరగతి వరకు నా విద్యాభ్యాసమును చేయగలిగితిని. ఆనాటి రోజులలో ఇది గొప్ప విద్యగా భావించెడివారు. మాది కలిగిన కుటుంబము గనుక మా అన్నగారి కుమారుడు షేక్ అబ్దుల్ మహబూబ్ బాషను కూడ నాతో ఉన్నత చదువు చదువుకోవడానికి నెల్లూరు పంపవలెనని ఒక ఆలోచన మా తండ్రిగారికి ఉండెను. నిష్ఠగలిగిన మహమ్మదీయ ముజాయిక్ కుటుంబంలో జన్మించుట వలన, నాకుగాని మా అన్న కుమారునికిగాని "అల్లా" యే దేవుడు, అల్లా తప్ప మరియొక దేవుడు లేడు, ఇది నిత్యము మా కుటుంబములో మాలో మేము తెలిసికొనియున్న సత్యము, "అల్లా" కాకుండ మరి ఏ దేవుని గురించైనను నా ముందు మాట్లాడితే నాలో ఆవేశము రగులుకొని, శరీర గగుర్పాటుతో ఆ ఎదుటి వ్యక్తులను, దూషించెడి మాటలతో అవమానపరచుట, వారిని కొట్టుట నా జీవితంలో ఒక నిత్య కృత్యము. ఈ హంగామాతో నాకు నేనే "అల్లా"యందు పవిత్రుడనని తలంచె ఒక ఛాందస్సుడను.

బడులకు సెలవులు ఉన్న ఎండాకాలము అనగా, "మే, జూన్" మాసములలో క్రైస్తవులు, క్రైస్తవ ఉపాధ్యాయులు గ్రామ గ్రామాలకు వెళ్లి సత్య సువార్తను ప్రకటించేవారు, ఆలాగుననే సి.యం. హైస్కూల్ ఉపాధ్యాయులు నెల్లూరు నుండి 1950 "మే" మాసములో కొన్ని దినములు దేవుని వర్తమానములు చెప్పుటకు సర్వేపల్లి గ్రామమునకు వచ్చిరి, కీర్తనలు పాడుచు వాక్యోపదేశము చేయుచు వీధి వీధిన కరపత్రములు పంచుచున్నారు. ఈ సంఘటన మా వీధిలో జరిగినప్పుడు నేను ఊహించనంత మహమ్మదీయ మత పిచ్చివానిగా, వారిని ఆటంకపరచి, దూషించి, అవ మానించి, పేడ, బురదతో వారి బట్టలు అపరిశుభ్రము చేసితిని, ఇతరులను అలా అవమానించుట తగినది కాదు. తర్వాత నా దుష్ప్రవర్తనకు నేనే అసహ్యించుకొంటిని. నాలోని మూఢభక్తి నన్ను అలా నడిపించినది. ఈ సమయములో మన అపొస్తలుడైన పౌలుగారిని జ్ఞాపకము చేయుట మంచిది. పౌలు తన జీవితంలో ఆది క్రైస్తవ సంఘమును ఎలా హింసించినాడో, ప్రభువు దర్శనము దమస్కు మార్గములో చూచిన వాడై ఒక నూతన అనుభూతిని పొంది తన జీవిత ఆశయములు ఎలాంటివో ఆత్మ దేవుడు మనకు పౌలుగారి ద్వారా తిమో. 1:12,16లో "పూర్వము దూష కుడను హింసకుడను హానికరుడనైన నన్ను తన పరిచర్యకు నియమించి నమ్మకమైన వానిగా ఎంచినందుకు, నన్ను

బలపరచిన మన ప్రభువైన క్రీస్తు యేసుకు కృతజ్ఞుడనై యున్నాను. తెలియక అవిశ్వాసము వలన చేసితిని గనుక కనికరింపబడితిని" తెలియజేశాడు. పాపమును ఒప్పు కున్నాడు గనుక కనికరింపబడ్డాడు. సామె.28:13 "అతి క్రమములను దాచిపెట్టువాడు వర్ధిల్లడు. వాటిని ఒప్పుకొని విడిచి పెట్టువాడు కనికరము పొందును" పౌలుగారి సత్య సువార్తను మనమందరు అంగీకరించవలసినదే, ఈ వచనముల ద్వారా నా దుష్ప్రవర్తను నా ప్రభువు సన్నిధిలో ఒప్పుకొని నేను కనికరింపబడితిని.

నేను గ్రామ చదువు ముగించి ఉన్నత చదువు కొరకు నెల్లూరు పట్టణములోని సి.యం.హైస్కూల్ అను ఒక క్రైస్తవ పాఠశాలలో 1950 జులై మాసములో ఆరవ తరగతిలో చేరితిని. నేను మరికొందరు పిల్లలు తరగతిలో యుండగా నాలో మరుపురాని సంఘటన జరిగినది. దాని వలన భయాందోళన అనుభూతిని పొందితిని, అదేమనగా మొదటి గంటలో తరగతి గదిలోకి వచ్చిన టీచర్, "మే" నెలలో మా గ్రామమునకు వచ్చి సువార్త ప్రకటించినప్పుడు నేను ఎవరినైతే దుర్భాషలాడి అవమానపరచానో వారిలో ఒకరు. నేను చేసిన సిగ్గుమాలిన పనికి నాపై కక్షతో నన్ను బడి నుండి వెళ్లగొట్టుట ఖాయమని భయపడ్డాను. ఇక చదువుకు స్వస్థి చెప్పి మాగ్రామానికి వెళ్లి మోటు పనులు చేసికుంటూ బ్రతకవలసినదేనని భీతి చెందితిని. అయితే ఆ టీచరుగారు నన్ను భయపెట్టక తన మంచితనముతో ప్రేమగా నాతో మాట్లాడుట నాకెంతో ఆశ్చర్యమును కలిగించినది, ఆ ఉపాధ్యాయుడు ప్రేమగా చిరునవ్వుతో మాట్లాడుతున్నప్పుడు తరగతిలోని విద్యార్థులందరు ఇదివరకే ఉపాధ్యాయునితో పరిచయమున్నదని తలంచిరి. రెండవ గంటలో మరియొక ఉపాధ్యాయుల వారు తరగతికి వచ్చి, వారి యెడల నేను చేసిన అవమానమును జ్ఞాపకం చేసికొనక, నన్ను బెదిరిం పక ప్రేమతో పలుకరించి నా కుటుంబ సభ్యులను గురించి అడిగి తెలుసుకున్నప్పుడు, ఈ క్రైస్తవులకు ద్వేషముండదా! ఎంత ప్రేమతో మాట్లాడుచున్నారు, ఏమిటీ వింత? ఇంత ప్రేమ కలిగి యుండుటతో, వీరిలోని క్షమ బహుశా ప్రభువు ప్రేమను నేను తెలుసుకొనుటకే కాబోలు, ప్రభువు ఆనాడు నన్ను దూషకునిగా ప్రవర్తింప చేసినది. ప్రభువు ప్రేమ, క్షమాగుణము ఈ భక్తుల ద్వారా నేను తెలిసికొంటిని, బహుశ నాలో మార్పు చెందుటకు ప్రభువు ఈ భక్తులను సాధనము లుగా వాడుకున్నాడు. ఈ సందర్భంలో కొన్ని వాక్య భాగము లను మీ ముందుంచుట ఎంతో ఆశీర్వాదము మత్తయి 5:43,44 "నీ పొరుగు వాని ప్రేమించి, నీ శత్రువును ద్వేషించుమని చెప్పబడిన మాట విన్నారు కదా, నేను మీతో చెప్పునదేమనగా, మీరు పరలోకముందున్న మీ తండ్రికి కుమారులైయుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి" లూకా 6:27,28 "వినుచున్న మీతో నేను చెప్పునదేమనగా – మీ శత్రువులను ప్రేమించుడి, మిమ్మును ద్వేషించు వారికి మేలుచేయుడి, మిమ్మును శపించువారిని దీవించుడి, మిమ్మును బాధించు వారికొరకు ప్రార్థన చేయుడి" అపొస్తలు డైన పౌలు మహాశయుడు ఈ రీతిగా తెలియచేస్తున్నాడు రోమా 12:17 "కీడుకు ప్రతి కీడెవనికిని చేయవద్దు. సమస్త మనుష్యులతో సమాధానముగా ఉండుడి" రోమా 13:10 "ప్రేమ పొరుగు వానికి కీడు చేయదు, గనుక ప్రేమ కలిగి యుండుట ప్రభువు చిత్తమనే ధర్మశాస్త్రమును నెరవేర్చు టయే" జీవవాక్యాను సారముగా ఉపాధ్యాయులైన దేవుని బిడ్డలు మాటలతోను, క్రియతోను నన్ను శిక్షింపక ప్రేమతో క్షమించిరి.

నా ఆత్మీయ ఊహలకు ఈ భక్తుల ప్రేమ, క్షమ నాలోని దుష్టత్వమును వదలించి దేవుని ప్రేమను తెలుసుకోవాలని, రోజురోజుకు నాలో ఆరాటము, ఆశ కలిగిన వాడనై, దేవుని వాక్యమును వినాలి, చదవాలని ఆ యేసు ప్రభువే నాలో గొప్ప ప్రేరణ కలుగజేసినాడు. దేవునికి స్తోత్రములు దేవుడు ఈ మార్గమును నాకు తెలియచేసినందుకు. ఇంతకాలము ఆ ప్రేమమూర్తియైన యేసయ్య కృపను నిరర్ధకము చేసితినే నని పదేపదే దేవుని సన్నిధిలో ప్రార్థించి ఆయన దయను పొందితిని. నాలో కలిగిన ఈ మార్పు మా అన్నగారి కుమారునికి ఎంతో ఆశ్చర్యమును కలిగించెను. ఆ రోజు మొదలు పాఠశాలలో జరుగు క్రైస్తవ ఆరాధనలో పాల్గొంటు

దేవుని ప్రేమ సందేశాలు దేవుని బిడ్డలైన ఉపాధ్యాయుల ద్వార తెలుసుకొని, వినిన ఆత్మీయ బోధలు శ్రీరాజమన్నార్ అను ఉపాధ్యాయుని ద్వారా మరల నెమరవేసుకుంటూ, నా పాప జీవితమును తలంచుకుంటూ, నేను ఎంత ఘోర పాపిని, నా జీవితము ఏపాటిది, నా పాపమునకు మరణమే శరణ్యమని భావించి, ఆందోళన చెంది నాకు వచ్చిరాని మాటలతో ఎన్నోసార్లు ప్రభువు సన్నిధిన కన్నీటితో ప్రార్థించి తిని. అపొస్తలుడైన పౌలుగారు రోమీయులతో చెప్పిన మాట నన్ను ఎంతో భయాందోళన కలిగించినది, రోమా 6:23, "ఏలయనగా పాపమువలన వచ్చు జీతము మరణము, అయితే పాపమును ఒప్పుకొని పాపమును విడచిపెట్టు వానికి దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తు యేసు నందు నిత్యజీవము" తెలిసీ తెలియని విశ్వాసజీవితములో నేను నాలుగు సంవత్సరములు గడిపితిని. ఈ సమయములో నా ఆత్మీయ తల్లిదండ్రులుగా అల్లారి రాజమన్నార్, దానమ్మ గార్లు నా ప్రతి ఆత్మీయ సమస్యను తీర్చేడివారు. వారి సహవాసము, నా ఆత్మీయ జీవితమునకు సజీవ వాక్యముతో నన్ను సంతృప్తిపరచేవారు. ఈ గౌరవనీయ ఆత్మీయ కుటుంబ మును పాఠకులకు పరిచయము చేయుట నా బాధ్యత, నా శ్రమలలో, నా సంతోషములో నాకు తోడుగా నీడగా నాకు అండగా నిలబడిన కుటుంబము. **(సశేషం)**

## సాక్ష్యాలకు ఆహ్వానము

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక వినినవారు విశ్వాసంలో బలపడుటకు మీ సాక్ష్యం ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్యమైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడలవాటిని సంతోషంగా పత్రికా ముఖంగా ప్రచురించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు పాలి భాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.

## చందాదారుల వివరములు

రెవ.డా॥ వి. విజయకుమార్, బొబ్బిలి - 5000/-
మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా 5000/-
రావెల ప్రసాదరావు, గుంతకల్లు (21-06-24) - 5000/-
వై. సంధ్యారాణి, ఒంగోలు - 2000/-
డా॥ సిహెచ్‌కె. సుష్మ ప్రశాంత్, నెల్లూరు - 1500/-
జయ, గుంటూరు (6-3-24)- 1500/-
గంధం డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) -1000
జి.మాణిక్యమ్మ అనంతపురం (25-3-24) 1000/-
కె. రజిని, నరసరావుపేట - 1000/-
రత్నకుమారి, మచిలీపట్నం (10-9-24) 700/-
వి. కస్తూరి, భీమవరం 500/-
శాంతాగ్రేస్, మచిలీపట్నం 500/-
పి.వి.రెడ్డి, ఒంగోలు - 500/-
బి. నెహెమ్యా, చిన్నగంజాం - 500/-
నైటింగేల్, నెల్లూరు - 500/-
మారనాత బైబిల్ సెమినరీ, విజయవాడ - 500/-
డి. శ్యామ్‌సిన్హా, బాపట్ల - 500/-
ఆర్. దేవికుమారి, పర్చూరు (20-5-24) 500/-
యం. విల్సన్, నెల్లూరు (14-09-24) 500/-
జి. జార్జిథామస్, దుగ్గిరాల - 500/-
వి. రత్నమ్మ, హైదరాబాద్ 350/-
జి. కళావతి, ఒంగోలు 350/-
కె. కల్పన, గోవా - 350/-
జి. వెంకటేశ్వర్లు, కొత్తపల్లి - 350/-
సి.హెచ్.స్వయంప్రభ, చిలకలూరిపేట (18-3-24) 350/-
కె. రాజేష్, రాజమండ్రి - 350/-
యస్. గోపి, పార్వతీపురం - 350/-
శ్రీమతి. సరోజిని -350/-
పి. దేవదానం, గుంటూరు - 300/-
టి. క్రిస్టియానమ్మ, నందికొట్కూరు - 350/-
టి.యం. భగవాన్‌దాస్, కదిరి (7-3-24) - 350/-
కె. విజయకుమార్, ఒంగోలు (1-3-24) 350/-
జె. రాజేష్, ఒంగోలు (6-7-24) 350/-
పి. యేసుబాబు లోకేష్, చింతలపూడి - 200/-
ఆర్. ఇన్నయ్య, గుంతకల్ - 200/-

# నీ సృష్టికర్త

దేవుడు మానవున్ని ఎంతో ప్రేమించి అతని కొరకే ఈ సమస్త సృష్టిని చేశాడు. దేవుడు మానవుని కొరకు చేసిన ఈ సృష్టి చాలా పెద్దది ఒక రకంగా చెప్పాలంటే అనంతం. అటువంటి అనంతమైన సృష్టిని మానవుడు ఆస్వాదించడానికి అతి చిన్న భాగాన్ని మానవ శరీరంలో పెట్టాడు అదే 'కన్ను'.

మానవుని శరీరంలో కేవలం 28గ్రాముల బరువు కలిగి అతి సున్నితమైనది మరియు మెదడు తర్వాత అత్యంత క్లిష్టమైన శరీర భాగం కన్ను. మానవుని కంటిలో ముఖ్యంగా మూడు భాగాలు ఉంటాయి. మొదటిది కార్నియా. మనం ఏ వస్తువునైనా చూడగానే మొదట కాంతి పడే భాగం ఈ కార్నియ. దీని ద్వారానే కాంతి కంటి లోనికి వెళ్తుంది. ఆ తరువాతి భాగం ఐరిస్. ఇది ఎంత కాంతి లోనికి వెళ్ళాలో నిర్ణయించి పంపుతుంది దానికి అనుగుణంగా ఆ తరువాతి భాగమైన ప్యూపిల్ తన ఆకారాన్ని, పరిమాణాన్ని మార్చుకుంటుంది. ఆవిధంగా కంటి లోపలి భాగాన్ని చేరిన కాంతిలోని సమాచారాన్ని కంటి కణజాలం (రాడ్స్ మరియు కోన్స్ అనబడే సున్నితమైన కంటి కణాలు) విశ్లేషించి చిత్రాన్ని రూపొందిస్తాయి. అయితే ఆ చిత్రం వాస్తవ చిత్రానికి తలక్రిందులుగా ఉంటుంది. దానిని మెదడు సరిచేయగా మనకు వాస్తవ చిత్రం కనబడుతుది. ఇదంతా మనకు క్షణకాలంలో జరిగిపోతుంది. ఎంత ఆశ్చర్యమో కదా!

కెమెరాతో పోలిస్తే మన కన్ను 576మెగా పిక్సల్స్ రెజల్యూషన్ కలది. అడ్వాన్స్డ్ కెమెరాలో కూడా లెన్స్ ఆటోమాటిక్‌గా అడ్జస్ట్ అవ్వదు కాని మానవుని కంటిలోని ప్యూపిల్ ఆటోమాటిక్‌గా తన ఆకారాన్ని, పరిమాణాన్ని మార్చుకుంటుంది.

మన కన్ను 10మిలియన్ రంగులను గుర్తించగలదు.

కన్ను సైజు కేవలం 2.3సెం మీ. మాత్రమే

మానవుని శరీరంలో రక్తనాళాలు లేని ఒకే ఒక భాగం కంటిలోని కార్నియా.

కంటిలో 12.7 మిలియన్‌ల కణజాలం ఉంటుంది. ఇవి సెన్సార్స్‌లా పనిచేస్తాయి. వాటిలో 12 మిలియన్‌ల కణజాలం కేవలం నలుపు, తెలుపు రంగులను మరియు 30రకాల గ్రేకలర్ షేడ్స్‌ను గుర్తించడానికి ఉపయోగ పడతాయి. మిగిలిన 7మిలియన్‌ల కణాలు ఎరుపు, పచ్చ, నీలం రంగులను గుర్తించుటకు ఉపయోగపడతాయి

వేలిముద్రలలో 40రకాల లక్షణాలు ఉంటాయి. ఇవి ప్రతి మనిషికి ప్రత్యేకంగా ఉంటాయి. అలానే కంటి ఐరిస్‌లో 256 ప్రత్యేక లక్షణాలు ఉంటాయి. ఇవి ప్రతి మనిషికి వేరు వేరుగా ఉంటాయి. కాబట్టి కంటిలో ఉండే ఐరిస్ అనేది ప్రతి మనిషికి ప్రత్యేకంగా ఉంటుంది. ఆ కారణంగానే ధృవీకరణ పత్రాల ప్రక్రియలలో వేలిముద్రలతో పాటు, కంటి ఐరిస్‌ను వాడతారు.

ఒక క్రొవ్వొత్తి వెలుగును మానవుని కన్ను దాదాపు 30 మైళ్ళ దూరం నుండే కనిపెట్టగలదు. నీటిలో కూడ చూడడానికి వీలుగా కంటిలో ప్రత్యేక నిర్మాణం ఉంటుంది.

మానవ శరీరంలో అత్యం వేగంగా కదిలేది కంటి కణజాలం. సెకనులో వందోవంతు సమయంలో కన్ను కదులుతుంది అందుకే కదిలే వస్తువులను కూడా మనం చూడగలుగుతాం.

మెదడులో 80% కంటికి సంబందించిన సమాచారం అంటే మనంచూసి గ్రహించిన సమాచారమే నిక్షిప్తమౌతుంది. మిగిలిన 20%లో వాసన, రుచులకు సంబంధించిన సమాచారం మరియు వినిన సంగతులు నిక్షిప్తమౌతాయి.

మానవ శరీరంలో చిన్నదైన కంటి నిర్మాణంలో దేవుడు ఇంత శ్రద్ధను చూపించాడంటే దేవునికి మానవుని పట్ల ఉన్న ప్రేమ ఎటువంటిందో గ్రహించవచ్చు. ఆ ప్రేమను నిర్లక్ష్యము చేయక ఆ దేవ దేవునికి కృతజ్ఞత కలిగి జీవిద్దాం!

ఆధునిక దృక్పథం

క్రొత్త కోణాలు

# 8. కనికరం చూపటం - పొందటం

**"కనికరము గలవారు ధన్యులు; వారు కనికరము పొందుదురు" - మత్త. 5:7**

**Blessed are the merciful : for they shall obtain mercy•KJV.**

**బైబులులో కొన్ని విషయాల్ని మనం ఉచితంగా పొందుతాం - పాపక్షమ, కృపలాంటివి. వాటికి తిరిగి మనం దేవునికి కృతజ్ఞత కన్న మరేమి బదులియ్యం, యియ్యలేం! మరి కొన్ని విషయాలున్నాయి - 'కనికరం', మానవుల అపరాధాలను క్షమించటం' వంటివి. ఇవి ఇచ్చిపుచ్చుకోవాలని క్రైస్తవ్యం నేర్పిస్తుంది. ఈ ధన్యతలో క్రొత్తకోణమంతా 'కనికరం' గురించి.**

ఈ వ్యాసం క్రొత్తకోణాల్లో తొమ్మిదోది, ధన్యతల వరుసలో ఐదోది. 'వ్యాసం' అంటున్నాం. 'బోధ' లేక 'ప్రసంగం', లేక 'ధ్యానం' అంటంలేదు. ఈ మాటల్ని పవిత్రులు, పరిశుద్ధులైన పాస్టర్లకు వదిలేస్తున్నాను. దేవుని దయవల్ల వాక్యాన్ని నేను బాగానే చదువుకొన్నా, ఎందుకో అలాంటి గొప్పగొప్ప మాటలను పయోగించటానికి తటపటాయించాల్సి వస్తుంది. **కనికరం**: ఈ ధన్యతలో మర్మం కంటే ధర్మం ఎక్కువగా కనిపిస్తుంది. దేవునిలో చూచేదే కాక మానవ మాత్రుల్లో కూడ చూడగలిగేది కనికరం. పరమకసాయి వానిలో నైనా, త్రాగుబోతులో నైనా, రాడికల్లోనైనా చూడగల్గేది కనికరం! ఈ ధన్యతలో కనికరం ఉంటమేకాదు కాని దానిని చూపటం అంటే అందుకు తగినట్లుగా కనికరం అవసరమైన వాని యెడల తగురీతిగా మనం మానసికంగా, ఆత్మీయంగానే కాకుండా, కార్యరూపంలో కూడ సంధించటం అనేది ముఖ్య మైంది. మనుష్యులు మీకేమి చేయవలెనని మీరు కోరుదురో మీరును వారికి ఆలాగే చేయుడి  బైబుల్లో చెప్పిన మాటలు.

కనికరం పొందాలి అంటే కనికరం ఇయ్యాలి (చూపాలి) కూడ!  తమిళనాడు ముఖ్యమంత్రి ఒకరున్నారు. ఆయన పేరు కరుణానిధి. ఆయన ఒక సారి చమత్కారంగా అన్నాడు కదా నాలో 'కరుణ' అయితే చాల ఉంది కాని, మీకేమైనా చేద్దామా అంటే 'నిధి' మాత్రం చాల కొరతగా ఉంది అని. కనుక, ఈ ధన్యత రహస్యమంతా ఇందులో ఉన్నట్లనిపిస్తుంది.

**క్రొత్త నిబంధన బోధ:**

మనమొకటి పొందాలంటే, దాన్ని మనం పంచాలి అనే సూత్రం క్రొత్త నిబంధన అంతటిలో పడుగు పేకలా అల్లుకపోయి ఉంది. 'కనికరము చూపని వాడు కనికరము లేని తీర్పు పొందును; కనికరము తీర్పును మించి అతిశయపడును' అని అపొస్తలుడైన యాకోబు అన్నాడు (యాకో. 2:13). ఈ సంధర్బంలో యాకో. 2:1-13 వాక్యభాగం చదివితే మంచిది. కనికరం యిచ్చి పుచ్చుకొనే సూత్రాన్ని వ. 6లో 'అయితే మీరు దరిద్రులను అవమాన పరచుదురు. ధనవంతులు మీ మీద కఠినముగా అధికారము చూపుదురు' అనటంలో చేబదుళ్ళు (reciprocal)గా చూపాల్సిన కనికరానికొక ప్రాతిపదిక సూత్రాన్ని (basis) చూడొచ్చు. మనం కనికరం చూపేవారే మనకు కనికరం చూపాలని ఎదురు చూస్తాం. అలా చూపకపోవచ్చు; అనేక సందర్భాల్లో చూపరు కూడా! కాని, మనం చూపిన కనికరం మాత్రం ఎప్పుడో ఒకసారి, ఏదో ఒక సంధర్భంలో, ఎవరో ఒకరి ద్వారా మాత్రం తిరిగు చవి చూడగలమనేది ఈ సర్వ సత్యం (hypothesis) యొక్క పరమార్థం!

కనికరం-క్షమాగుణం కలగాపులగమైనవి. ఈ సత్యాన్ని కళ్ళకుగట్టేట్లు యేసు పేతురుతో చెప్పిన 'క్షమింపని' 'కనికరము చూపని' చెడ్డదాసుని ఉపమానం (మత్త 18:21-35) తేటతెల్లంచేస్తుంది "మీలో ప్రతివాడును తన సహోదరుని హృదయపూర్వకముగా క్షమింపని యెడల నా పరలోకపు తండ్రియు ఆ ప్రకారమే మీ యెడల చేయుననెను" (వ. 35).

పరలోక ప్రార్థన నేర్పిస్తూ యేసు శిష్యులకు చెప్పింది - మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మా ఋణములు క్షమించుము' (మత్త. 6:12) అని. ఇదే ఇంగ్లీషు లో, And forgive us our debts, as we forgive our debtors అనటంలో 'as ' అనేది just as అనే పోలికగాగాని, లేక సమాంతరంగా జరిగే విషయాలుగా గాని ద్యోతకం కావచ్చు. అయితే, తెలుగులో బహు గంభీరంగా 'క్షమించియున్న ప్రకారం' అనటంలో, మనం గతంలో అలా

చేయటం పూర్తిచేసి గాని ఈ ప్రార్థనాంశాన్ని అడిగి ప్రయోజన ముండదన్నంత కఠినంగా, బాధ్యతాయుతంగా వ్రాయబడింది సుమా! పరలోక ప్రార్థనలో తక్కిన విషయాల మీద యేసు టీకా తాత్పర్యాన్నియ్యలేదు. ఈ ఒక్క విషయాన్నే మరలా 14,15 వచనాల్లో సవిస్తరించటం చూస్తే దీని ప్రాధాన్యత ఎంతో గమనించవచ్చు.

**ఇంకా లోతైన విషయం**: 'కనికరం' అనే మాట భావార్థాలు అంతటితో ఆగదు. ఈ ధన్యతలో ఉన్న కనికరం అంతకన్నా లోతయింది. ఒకవేళ ఈ అంశంలో క్రొత్తకోణం అనదగింది యీ విషయమనే అనవచ్చు: (mercy) కనికరం అనేమాట గ్రీకుమూలం 'ఎలెహ్ ఆయ్‌మోన్' అనేమాట. ఎలెహ్' ఆయ్ మోసూనే ధాతువు నుండి వస్తుంది. దాని అర్థం కనికరం చూపు, పడు (మాట, చేతలతో, మరిముఖ్యంగా, దైవకృప ద్వారా) కనికరం, దయకలిగి ఉండటం కలిగియుండు (పొందు, స్వీక రించు, చూపు) అని. ఇది సర్వసాధారణంగా పేదల దిశలో ప్రసరించేది. అంటే భిక్షం, ధర్మం, సహాయం చేయడమని.

అయితే, మన క్రొత్తనిబంధన గ్రీకు ఇంకా ఆదిలోకి, అంటే హెబ్రీ లేక అరామి భాషాప్రయుక్తంగా ఉంటుంది. కనుక, ఈ గ్రీకుమాటలు ఆదిమ హెబ్రీమాట అయిన చెసెద్ (chesed) కు దారితీస్తుంది. అయితే, ఈ హెబ్రీమాటలో అర్థమంతా వచ్చేట్లు తర్జుమా చేయగల్గిందికాదు.

మన అనుదిన జీవితానుభవంలో సానుభూతి, కనికరం అనే మాటల్లోని అర్థం, క్రియ మాత్రమే అనుకోరాదు. అక్కరలో, ఆపదలో ఉన్న వారిని పాపం తలచటం లేక అనటం (feel or say sorry) మాత్రమే కాదు. 'చెసెద్' అనే మాట మూలంగా గల 'కనికరం'లో అక్కరలో ఉన్న మనిషి మెదడు, హృదయం, నరనరాల్లో మనం ప్రవేశించగల్గటమని. దీన్ని ఇంగ్లీషులో ఒక చక్కని phrase తో చెప్పొచ్చు: to get under the skin! అంటే ఎదుటివాని పరిస్థితి, సంక్షోభాన్ని అతడెంతగా ఆక్రో శిస్తుంటాడో అంత మేరవరకు పోగల్గటమని.

కనుక కనికరం కేవలం మనలో కలిగే భావోద్రేకం వలన చూపే దయాదాక్షిణ్యాలు కాదు. మన మనస్సు సంకల్పాలను ఈ భావోద్రేకం వశం చేసుకోవాలి. ఈ కనికరాన్ని ఏదో ఒక వస్తువును పోస్ట్‌మేన్‌లా అందించేది కాదు. అక్కరలోని మనిషి ఆవేదనతో పూర్తి తాదాత్మ్యత పాలిభాగస్వామ్యం పొందుతూ, ఒక విధంగా నీవే ఆ పరిస్థితిలో ఉంటే నీకు నీ విషయంలో నీవే ఎలా స్పందిస్తావన్నంత సాదృశ్యత అన్నమాట. కనుక సానుభూతిని సింపతీ అంటాము కదా. Sympathy అనే ఇంగ్లీషు మాట కూడ 'Syn గ్రీకులో అంటే 'కలిసి', ఒకటిగా (together with) అనిన్నీ, pathy అనేభాగం పాస్‌చీన్ (paschein) నుండి, అంటే, అనుభవించు (experience), శ్రమపడు (suffer) అనిన్నీ, మొత్తం మీద 'మరొక వ్యక్తితో కలిసి ఒకటిగా అనుభవించట'మని అర్థం. దీనికి చక్కగా సి.పి.బ్రౌన్, తన డిక్షనెరీలో Sympathy అంటే fellow-feeling అంటూ, 'నవ్వేవాడితో కూడ నవ్వడం, యేడ్చేవారితో కూడ యేడవటం' అని విశదీకరిస్తూ, మాటకు అర్థంగా, పరితాపం, అనుతాపం, కరుణ అని రాశాడు. అదే శబ్దరత్నాకరంలో 'సానుభూతిష అని ప్రత్యేకంగా మాటను list చేయలేదు. 'అనుభూతి' వద్ద దాని అర్థం. 'అనుభవం'. అది ఆంతరంగంలో ఉద్భవించి క్రియాత్మంగా పరిఢవిల్లు తుంది! 'సాను భూతి'లో 'స' అంటే 'మంచి' అనే అర్థం ఒకవేళ ఇక్కడ ప్రస్థావించబడుతున్న Sympathyతో సరితూగక పోవచ్చు. స్వానుభవమంటే అది స్వంత అనుభవమే కావచ్చు. కనుక ఈ Chesed (చెసెద్) అనేమాట బహు గంభీరమైంది. అంటే, ఒక విషయం సానుభూతి మన స్వయిష్ట ప్రకారంగా చేసేదికాదు ఆవేదన' పొందే వానిపక్షంగా గ్రహించాల్సింది. ఈ సందర్భంలో రెండుమూడు సంగతులు చూద్దాం.

### 1. తప్పుత్రోవలో సానుభూతి

మనం వేసే భిక్షం, చేసే సహాయం, యిచ్చే చందాలు మొదలైన వన్నీ ఇక్కడ చెప్పబడిన కనికరంతో సరితూగవు. చాలాసార్లు బాధితులు కోరే సానుభూతి ఒకటైతే మనం ఒలకపోసేది మరొకటి.

దీనికి అచ్చుపోసిన ఉదహరణ మరియ, మార్తల ఉదంతం. (లూకా 10:38-42). యేసు సిలువ శ్రమలు ఎంతో దూరంలో లేవని ఆయనకు తెలుసు. ఆయన బేతనియలోని మరియ, మార్తల యింటికి వచ్చినప్పుడు ఆయన కోరుతుంది ప్రశాంతత. మార్త ఆయన్ని ప్రేమించింది. అయితే, డేగిశాల గడబడల్తో, మరియ సహాయం చేయడం లేదనే చిఱ్ఱుబుఱ్ఱుల్తో హంగామా చేస్తుండింది. మరియ, యేసు నిజమానసిక పరిస్థితినర్థం చేసుకొంది. ఆయనతో ప్రశాంతంగా కూర్చుని, బహుశః, మౌన

సముద్రంలో ఆయన హృదయ వేదనకు తన హృదయ వేదికను సమర్పించింది! అందుకే, ఆమె ఉత్తమ మైనది కోరు కొనిందని ప్రభువు ప్రస్తావించాడు. చేపనియ్యమంటే పామునియ్యొద్దు!

**2. కనికరం క్షమను సులభం చేస్తుంది**

ఇతరులొక పని ఎందుకు చేశారా అనివారి దృక్పథంలో ఆలోచిం చినప్పుడు తప్పొఒప్పుగా కనిపిస్తుంది. క్షమాపణ సులభమవుతుంది. ప్రతివ్యక్తి తలంపులోగాని, చేసే పనుల్లో గాని ఒక కారణం, హేతువు (reason) ఉంటుంది. అది తెలుసుకొనే కనికరం ఉంటే క్షమించటం ఎంతో సులభ తరమౌతుంది. నేటి శిక్షాస్మృతి (Crime & Punishment) విధానంలో క్షమించటం అసంభవమనుకొన్న ఉరిశిక్షార్హుల కెందరికో క్షమాభిక్షతో విడుదల కలగటం చూస్తున్నాం. కొన్నిసార్లు సరియైన సాక్షాధారాలు లేక కావచ్చు. అయితే, అతడు చేసిన నేరానికి గల చోదకం(motive)ను అర్థంచేసు కొనటం వల్ల కూడానని చూడవచ్చు.

**3.** అసలు, దేవుడు మనలను క్షమిస్తున్నాడంటే మన రక్తమాంసాల్లో నేరగుణం (పాపం) అణువణువున జీర్ణించుకు పోయిందనే అవగాహన, దానివల్లవచ్చే కనికరంనుబట్టేనని నేను పూర్తిగా నమ్ముతున్నాను. దేవుడు కోరేది, బహుశః పాపం చేయొద్దనే దానికంటే పశ్చాత్తాపపడి దానికి దూరంగా ఉండి రక్షణ ఫలాల్ని విరియగాయమని!

పరిశుద్ధుడైన దేవునిగా చేయలేని పనిని తానే కుమారునిగా, మర్త్యునిగా యీ లోకానికి వచ్చాడు. మానవుల 'చర్మం క్రింద దూరాడు'! మానవునిగా వచ్చి మానవ కళ్ళతో చూచాడు. మానవ స్పృహతో స్పందించాడు. మానవ జీవితంలో లీన మయ్యాడు (పాపంతో కాదులే!), కనుక, మానవుల్ని రక్షించ టానికి స్వరక్త మిచ్చాడు. అంటే, కొన్ని యితర మతాల్లో చెప్పినట్లు సుదూరంగా, అంటకుండా, వేరుగా, అన్నింటికన్నా మహాగంభీర స్వరూపిగా గాక ఒక సాదాసీదా మానవునిగా వచ్చాడు. చెసెద్ అనే మాటలోని అర్థం మూసపోస్తే క్రీస్తు దివినుండి భువికి వచ్చినదంతా మూర్తీభవిస్తుంది. ఆ కనికరం చూపగల్గిన వారికి కనికరం, ముఖ్యంగా దేవుని కృపా సమృద్ధ కనికరం, కలుగుతుంది. అదే ధన్యతైన తృప్తి!

వచ్చే మాసం: **దేవుణ్ణి చూడటం**

## కొడవటికంటిగారి రచనలు

| | | |
|---|---|---|
| 1. | మడిమెను పట్టుకొనినవాడు | రూ. 40 |
| 2. | ఆసెనతు | రూ. 150 |
| 3. | అపొస్తలుడు | రూ. 250 |
| 4. | నా చిత్తానుసారుడు | రూ. 110 |
| 5. | గుంట నుండి మింటికి | రూ. 50 |
| 6. | విశ్వాసంలో ఓ మెట్టు | రూ. 60 |
| 7. | విశ్వాసంలో మరో మెట్టు | రూ. 65 |
| 8. | తోటలో పనివాడు | రూ. 20 |
| 9. | గోత్రకర్త (యాకోబు) | రూ. 50 |
| 10. | నా కుటుంబము | రూ. 25 |
| 11. | నా దూత (బాప్తిస్మమిచ్చు యోహాను) | రూ. 50 |
| 12. | నా కుమారి (రూతు) | రూ. 60 |
| 13. | నా స్నేహితుడు | రూ. 50 |
| 14. | అంత్యదినములలోని యధార్ధ ప్రవక్త | రూ. 50 |
| 15. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -1 | రూ. 65 |
| 16. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -2 | రూ. 65 |
| 17. | ప్రయాణంలో ఓ మజిలి | రూ. 65 |
| 18. | నాజరు (సమ్సోను జీవిత చరిత్ర) | రూ. 65 |
| 19. | సువార్తలలోని యేసుకథ | రూ. 75 |
| 20. | యేసుకథ రెండవ భాగం | రూ. 75 |
| 21. | యేసుకథ మూడవ భాగం | రూ. 75 |
| 22. | జీవనమంతయు | రూ. 40 |
| 23. | టాల్‌స్టాయ్ కథలు 1 భాగము | రూ. 65 |
| 24. | టాల్‌స్టాయ్ కథలు 2వ భాగము | రూ. 65 |
| 25. | ఓ చినుకునవుతా... | రూ. 30 |
| 26. | మిక్కిలి సాత్వికుడు | రూ. 150 |
| 27. | విశ్వాసము విజయము-1 | రూ. 70 |
| 28. | విశ్వాసము విజయము-2 | రూ. 70 |
| 29. | విశ్వాసము విజయము-3 | రూ. 70 |
| 30. | హదస్సా | రూ. 70 |
| 31. | మిక్కిలి సాత్వికుడు | రూ.150 |

పుస్తకములు కావలసినవారు :
రెవ. డా॥ కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర
కృపాదానంగారివీధి, క్లౌపేట, 6వ లైను
ఒంగోలు-523001
ప్రకాశం జిల్లా, ఫోన్ : 9440217726

# దేవుడు అంగీకరించే ఉపవాసము

మన ప్రభువైన యేసుక్రీస్తు నామమున మీ అందరికీ శుభములు... ఉపవాస ప్రార్ధన అంటే ఏమిటి? సాదారణంగా ఉపవాసం అంటే తినడానికి ఆహారం, శక్తి, ఆరోగ్యం ఉన్నా కూడా ఆహారం తీసుకోకపోవడమే ఉపవాసం అని అంటారు. అయితే మనం చేసే ఉపవాసం దేవుని దృష్టికి అంగీకారం అవ్వాలంటే కేవలం ఆహారం మాని ఉంటే అది అంగీకారం అవదు. మరి ఎట్టి ఉపవాసం దేవునికి అంగీకారం అవుతుందో చూద్దాం...

మొదటిగా యేసుక్రీస్తు ప్రభువు ఉపవాసం గురించి ఏం చెప్పాడంటే "మీరు ఉపవాసం చేయునప్పుడు వేషదారులవలె దుఃఖముఖులై ఉండకుడి. తాము ఉపవాసము చేయుచున్నట్లు మనుషులకు కనపడవలనని వారు తమ ముఖము వికారము చేసుకొందురు." మనుష్యులకు కనబడవలెనని కాక, రహస్య మందున్న నీ తండ్రికి కనబడవలెనని నీవు ఉపవాసము చేయు నప్పుడు నీ తల అంటుకొని మీ ముఖము కడుగుకొనుము (మత్తయి 6:16,17). అయితే కొంతమంది తమ ముఖాలను వికారం చేసుకొని కృంగిపోయి మనుష్యులకు కనబడవలెనని ఈరోజు మేము ఉపవాసం ఉన్నామని అందరికీ చెప్పకనే చెప్తుంటారు. మరి కొంతమందైతే, పక్కింటివారో, లేక చర్చిలో వారో 40 రోజులు ఉపవాసం ఉంటున్నారని వీరు కూడా పోటీపడి 40 రోజులు ఉపవాసం చేసి గొప్పగా చెప్పుకోవాలని ఇష్టపడతారు.

మీరు హృదయపూర్వకంగా ఉపవాస ప్రార్ధన ఎన్ని రోజు లైనా చేయండి, ఆ ఉపవాస ప్రార్థనలో దేవునితో సహవాసం వల్ల మీరు ఏమి పొందుకున్నారో అందరికీ తెలియచేయండి, అంతేకానీ మీ గొప్పతనం చూపించడం కోసం, లేదా ఆచార వ్యవహారంగా ఉపవాసం ఉండకండి. అలా చేయడం దేవునికి అంగీకారం కాదు. ఇంకా "మీరు ప్రార్ధన చేయనప్పుడు వేష దారులవలె ఉండవద్దు. మనుష్యులకు కనపడవలెనని సమాజ మందిరములలోనూ వీధుల మూలల్లోనూ నిలిచి ప్రార్ధన చేయుట వారికి ఇష్టము, (మత్త.6:5). ఉపవాస సమయంలో మనుష్యులతో, చర్చీలలో, ఆన్‌లైన్ ప్రార్ధనల్లో కాదు నువ్వు ఏకాంతంగా దేవుని కలుసుకోవాలి, ఆయన సన్నిధిలో గడపాలి. మోషే 40 రోజులు ఉపవాసం ఉండి, దేవుని సన్నిధిలో గడిపాడు. (ద్వితీయో.9:9,17,19), నెహెమ్యా ఉపవాసం ఉండి. దేవుని ఎదుట విజ్ఞాపన చేశాడు (నెహెమ్యా 1:4), కాసేపు దేవుని వాక్యం చదువుతూ, కాసేపు ప్రార్ధన చేయడం చూడవచ్చు (నెహెమ్యా 9:1-3) ఎజ్రా కాలంలో ఉపవాస దినమున ప్రకటించడం మాత్రమే కాదు గానీ వారు ఉపవాసం ఉండి దేవుని వేడుకున్నారు (ఎజ్రా 8:21). కనుక మనం ఉపవాసం ఉన్నప్పుడు. హృదయపూర్వకంగా దేవుని సన్నిధిలో గడుపుతూ ఆయనను స్తుతిస్తూ, ప్రార్థిస్తూ, వాక్యాన్ని చదువుతూ, ధ్యానిస్తూ, వాక్యాన్ని ప్రకటిస్తూ సమయాన్ని గడపాలి.

దుర్మార్గులు కట్టిన కట్లను విప్పుటయు, కాడి మాను మేకులు తీయటయు బాధింపబడిన వారిని విడిపించుటయు ప్రతి కాడిని విరుగగొట్టుటయు నేనేర్పరచుకొనిన ఉపవాసం గదా? (యెషయా 58:6). మీ ఆహారము ఆకలిగొనిన వారికి పెట్టుటయు నీ రక్తసంబంధికి ముఖము తప్పించుకొనుటయు, దిక్కుమాలిన బీదలను నీ ఇంట చేర్చుకొనుటయు వస్త్రహీనుడు నీకు కనపడినప్పుడు వానికి వస్త్రములిచ్చుటకు ఇదియే కదా నాకిష్టమైన ఉపవాసం (యెషయా 5:1-8). ఇవి కూడా ఉప వాసంలో భాగమే. మీరు కలహపడుచు వివాదము చేయుచు అన్యాయంగా గుద్దులాడుతూ ఉపవాసము ఉందురు (యెషయా 58:4), మీరు ఉపవాసం ఉండి గొడవలు పడుచు వివాదాలు చేస్తూ అన్యాయం చేస్తూ ఇతరులతో సమాధానం లేకుండా ఇష్టానుసారమైన జీవితం జీవిస్తే, అట్టి ఉపవాసము నాకు అంగీకారము కాదు అని దేవుడు చెప్తున్నాడు. ఇతరులను బాధించుటయు వేలుపెట్టి చూపి తిరస్కరించుటయు చెడ్డ దానినిబట్టి మాట్లాడటం నీవు మానవలెను ( యెషయా 58:9). కొంతమంది తమ ఉద్యోగాలు చేస్తూ ఉపవాసం ఉంటారు, అరగంట లేదా గంట ప్రార్ధన చేసి ఈరోజు ఉపవాస ప్రార్ధన చేసాము అంటారు. ఈ విధంగా ఉపవాసముండటం వల్ల ఏమీ లాభం లేదు

నా ప్రియ సహోదరి, సహోదరుడా అనవసరంగా మీ శరీరంను ప్రాణమును ఆయాసపరచుకోవద్దు. ఒక్కపూటైనా, రెండు పూటలైన, మూడు రోజులైనా, 21 రోజులైనా, 40 రోజులైనా ఉపవాసం ఉండండి కానీ, మీరు దేవునితో ఆయన సన్నిధిలో అధికంగా గడపండి అప్పుడు మీరు ఆత్మబలం పొందుకుంటారు. ఈ లోకంలో అపవాది మీద విజయ వంతమైన శక్తివంతమైన జీవితం జీవిస్తారు. ఇటువంటి ఉపవాసము మన దేవునికి అంగీకారం.... ఆమేన్...

ఇట్లు, **డా॥ సుష్మ**

# యెహోవా యీరే

అబ్రాహాము విశ్వాస పరీక్షలో నెగ్గిన తర్వాత పలికిన మాట 'యెహోవా యీరే', అనగా 'యెహోవా చూచుకొనును'. అబ్రాహాము ఇస్సాకును బలివ్వడానికి ఇంటి దగ్గర బయలుదేరినప్పుడే 'దేవుడు చూచుకుంటాడు' అన్న నమ్మకంతోనే ధైర్యంగా బయలుదేరాడు. దహనబలికి గొఱ్ఱెపిల్ల ఏది? అని ఇస్సాకు అడిగినప్పుడు కూడా 'దేవుడు చూచుకుంటాడు' అని ఇస్సాకుతో చెప్పాడు.

'దేవుడు చూస్తున్నాడు', 'దేవుడు చూచుకుంటాడు' అని చాలా ఈజీగా చెప్పేస్తాము. కానీ, చూస్తున్న దేవుడు మన కోసం ఏదైనా కార్యము చేసేదాకా ఆగాలంటే చాలా కష్టం. ఎందుకంటే, మన కోరుకున్న పని ఆఘమేఘాల మీద క్షణాల్లో జరగాలని కోరుకుంటాము. దేవునికి అసాధ్యమైనది ఏదీ ఉండదు కాబట్టి, మనం అవసరాలన్నీ తక్షణం తీర్చాలని ఆశపడతాము. 'దేవుడు చూచుకుంటాడు' అని అనుకున్న తర్వాత ఆ విషయం గురించి ఆలోచించడం దేవున్ని నమ్మలేకపోవడమే.

మా నాన్న కొడవటికంటి సామ్యేల్‌రాజేంద్రగారు, ఆయన రచనల బాధ్యత నాకు అప్పగించిన తర్వాత రెండు నెలలకు ప్రభువు దగ్గరకు చేరారు. నాన్నగారు ఉన్నప్పుడు ఆయనను అభిమానించేవారు అనేకులు ఆయన రచనల ముద్రణకు ఆర్థిక సహాయం చేసేవారు. నాన్నగారు నా దగ్గర ఉన్నప్పుడు ఇద్దరు మాత్రం ప్రతినెలా ఒకరు 1500/-, ఇంకొకరు 2000/- పంపించేవారు. నాన్నగారు చనిపోయిన తర్వాత 'హన్నాకృప' మాసపత్రికకు చందా పంపించటం కూడా మానేశారు. నా కుమారుడు హనోక్ దశమభాగము ద్వారా పత్రిక నడపబడుతుంది.పత్రికకు కానీ, రచనలకు కానీ నాన్నగారికి ఆర్థిక సహాయం చేసేవారు ఎవరూ నాకు పరిచయంలేదు. ఒకవేళ నాకు ఎవరైనా పరిచయం ఉన్నా సహాయం చేయమని నేను అడగలేను. పుస్తకాల ముద్రణ బాధ్యత నాకు నేనుగా కోరుకోలేదు. దేవుడే అప్పగించాడు కాబట్టి 'దేవుడే చూచుకుంటాడు' అని నేను వాటి విషయం ఆలోచించడం మానేశాను.

ఆగష్టు 17వ తేది నాన్నగారి జన్మదినమున హన్నాకృప పత్రిక వార్షికోత్సవము చేయడం ఆనవాయితీ. 2023 జూలై 3న నాన్నగారు చనిపోయిన తర్వాత, ఆగష్టు 17వ తేదీన నాన్నగారి జన్మదినముతో పాటు హన్నాకృప 24వ వార్షికోత్సవము జరుప నిశ్చయించినాము. ఆ సందర్భముగా ఆహ్వానించుటకు చీరాలలోని బేర్ హాస్పిటల్‌ను నిర్వహిస్తున్న శ్రీ ఫ్రెడ్రిక్ నతానియేల్‌గారి దగ్గరకు వెళ్ళాను. నాన్నగారి చివరి పుస్తకము 'మిక్కిలి సాత్వికుడు' పుస్తకము ఆవిష్కరించ మని వారిని కోరినప్పుడు, వారు సంతోషముగా అంగీకరించ డమే కాకుండా పుస్తకము ముద్రణకు అయ్యే ఖర్చును వారే భరిస్తానని చెప్పారు. అప్పుడు నేను 'అపొస్తలుడు' పుస్తకము వేయించండి అని అడిగినప్పుడు, ఆయన అంగీకరించాడు. కాబట్టి 'అపొస్తలుడు' పుస్తకమును వారి శ్రీమతి స్వర్గీయ లలితా ఫ్రెడ్రిక్‌గారికి అంకితమివ్వడం జరిగింది. 'మిక్కిలి సాత్వికుడు' పుస్తకమును నా ఖర్చుతో నేనే ముద్రించి, నాన్నగారికి అంకితమివ్వడం జరిగింది. ఆ విధంగా రెండు పుస్తకములు ముద్రించబడినవి.

నాన్నగారు వ్రాసిన మొత్తం పుస్తకాలలో భాగాలుగా ఉన్న కొన్నింటిని కలిపి ముద్రించాలని నాన్నగారి కోరిక. నాన్నగారు ఉన్నప్పుడే 'జప్నత్పనేహు, ఆసెనతు' పుస్తకాలను కలిపి 'ఆసెనతు' పుస్తకంగా ముద్రించడం జరిగింది. నాన్నగారి కోరికనుబట్టి, 'అపొస్తలుడు, బర్నబా, తిమోతి' పుస్తకాలను 'అపొస్తలుడు'గా ముద్రించబడింది.

2024 ఆగష్టు 17న నాన్నగారి జన్మదినము రోజున 'జప్నత్పనేహు', 'నా చిత్తానుసారుడు' పుస్తకములు ఆవిష్క రింపబడ్డాయి. నాన్నగారి సహోదరి, నా మేనత్త శ్రీమతి అరుణా ఇమ్మానుయేలుగారు, 'నా చిత్తానుసారుడు' పుస్తకము నకు ఆర్థిక సహాయం అందించారు. అయితే జప్నత్పనేహు

పుస్తకము తాలూకు ప్రెస్‌వారికి 50,000 డబ్బు కట్టవలసి ఉంది. ఆవిష్కరణ కోసం జప్పత్నేహు 100 పుస్తకాలు, నా చిత్తానుసారుడు 100 పుస్తకాలు తీసుకురావడం జరిగింది. ప్రెస్ వారికి కట్టవలసిన డబ్బు కట్టి మిగిలిన పుస్తకములు తీసుకురావాలి. 'దేవుడు చూచుచున్నవాడు' కాబట్టి ఏదో ఒక ఆశ్చర్యకార్యము చేస్తాడని ఎదురు చూస్తున్నాను.

అంతేకాక, ఇంకా ముద్రించవలసిన పుస్తకములు యేసుకథ, నా స్నేహితుడు, నాజరు, గోత్రకర్త, నా దూత, నా కుమారి, హదస్సా ఉన్నాయి. నా స్నేహితుడు, గోత్రకర్త పుస్తకములు ముద్రించడం కోసం సిద్ధం చేసి ఉంచాము. నా చిన్న కుమార్తె హనీకకి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా బెంగుళూరులో ఉద్యోగం వచ్చినప్పుడు, తన మొదటి నెల జీతం మొత్తం 80,000 కానుకగా ఇచ్చింది. ఆ డబ్బుతో నాన్నగారి పుస్తకం 'యేసుకథ' ముద్రిస్తానని చెప్పాను. ఆ పుస్తకం మూడు భాగాలుగా వ్రాయబడింది. దానిని ఒకే పుస్తకంగా చేస్తే 416 పేజీలు వచ్చింది. నాన్నగారు వ్రాసిన పుస్తకాలలో యేసుకథ చాలా పెద్ద పుస్తకం కావడం వలన ముద్రణ ఆలస్యమవుతుంది.

ఆగష్టు 26వ తేది రాత్రి 8-30కి నేను ఆఫీసులో ఉండగా, నా కోసం ఎవరో వచ్చారని ఇంటి దగ్గర్నుండి కబురు వచ్చింది. నేను ఇంటికి వెళ్ళినప్పుడు బయట గేటు దగ్గర ఒకాయన నిలబడి ఉన్నాడు. నేను పలకరించగా, పుస్తకాలు వ్రాస్తారు కదా ఆయన కోసం వచ్చాను, యాకోబు జీవిత చరిత్ర పుస్తకము కావాలి అని అడిగాడు. నాన్నగారు చనిపోయిన విషయం చెప్పి, యాకోబు జీవితచరిత్ర 'గోత్రకర్త' పుస్తకము లేదండీ, ప్రింటింగ్ చేయించాలి అని చెప్పాను. 15 సం॥ల క్రితం నాన్నగారిని కలుసుకున్నారంట, ఆ రోజు ఇంట్లో భోజనం కూడా చేశాను అని చెప్పి మా కుటుంబ వివరాలన్నీ అడిగి తెలుసుకున్నాడు. నాన్నగారి పుస్తకాలు నా దగ్గర ఉన్నవన్నీ ఇచ్చాను. పుస్తకాలు ఎంత అని అడిగాడు. మొత్తం 1200/- అవుతాయి, 800/- ఇవ్వండి అని చెప్పాను. ఆయన జేబులో నుండి 500 రూపాయల నోట్ల కట్ట తీసి టేబుల్ మీద పెట్టాడు. నాకు అర్థం కాలేదు. మీకు కానుకగా ఇస్తున్నాను తీసుకోండి అని చెప్పాడు. అవి చూచినప్పుడు ఖచ్చితంగా 50,000 ఉంటాయేమో అనిపించింది. అప్పుడు నేను ఆయనతో, ఈ డబ్బుతో నాన్నగారు రాసిన యాకోబు జీవిత చరిత్ర 'గోత్రకర్త' ప్రింటు చేయిస్తాను అని చెప్పాను. ఆయన మీ ఇష్టం అన్నాడు. హన్నాకృప పత్రిక పంపడం కోసం ఆయన దగ్గర అడ్రసు తీసుకున్నాను. ఆయన పేరు రూబేన్‌పాల్, విశాఖపట్నం. రూబేన్‌పాల్‌గారికి పత్రికాముఖంగా నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ఆయన వెళ్ళిపోయిన తర్వాత ఆ డబ్బులు లెక్కపెట్టినప్పుడు ఖచ్చితంగా 50,000 ఉన్నాయి. వాస్తవానికి ఆయన పుస్తకము ముద్రించడానికి డబ్బు ఇవ్వకపోయినప్పటికీ, నాన్నగారి పుస్తకాల కోసం వచ్చాడు కాబట్టి, అదీకాక, ఆయన అడిగిన యాకోబు పుస్తకం ఇంకా ముద్రించలేదు కాబట్టి, ఆయన ఇచ్చిన డబ్బు నాన్నగారి పుస్తకము కోసం ఖర్చు చేయడమే న్యాయం అనిపించింది. అందుకే మరుసటి రోజు విజయవాడ వెళ్ళి ప్రెస్ వాళ్ళకి ఇవ్వవలసిన 50,000 చెల్లించి వచ్చాను.

**'దేవుడు చూచుకుంటాడు'** అనే దానికి నిదర్శనంగా ఇప్పటికే నాలుగు పుస్తకాలు ముద్రింపబడ్డాయి. 'యేసుకథ', 'గోత్రకర్త' పుస్తకాలకు డబ్బు సిద్ధం చేయబడ్డాయి. నాన్నగారి మొత్తం పుస్తకాలు ముద్రించడానికి అవసరమైన సుమారు 5 లక్షల రూపాయలు దేవుడు ముందే ఇచ్చినా, అవి ఒక్కరోజులోనో, నెల రోజులలోనో సిద్ధం చేయబడవు. అందుకే అవసరమైనప్పుడు మాత్రమే దేవుడు డబ్బు ఇస్తున్నాడు.

జూలై 3 నాన్నగారి ప్రథమ జ్ఞాపకార్థ కూడిక ముందు రోజున నాన్నగారి ఫ్రెండ్ ఒకాయన విశాఖపట్నం నుండి నాకు ఫోన్ చేసి, "డాడీ బుక్స్ భూమి మీద ఉన్నంతసేపు డాడీ బ్రతికే ఉన్నారు'' అని చెప్పారు. నాన్నగారు చనిపోయినప్పటికీ, ఆయన రచించిన పుస్తకాల ద్వారా భూమి మీద బ్రతికించి ఉంచడంకోసం దేవుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాడని రూబేన్‌పాల్‌గారితో ఆర్థిక సహాయం పంపడం ద్వారా నిరూపించబడింది.

స్త్రీల విభాగం

# ఓర్పా

ప్రభువునందు ప్రియ హన్నాకృప పాఠకులకు ప్రభువైన యేసుక్రీస్తు నామములో మీకు శుభములు కలుగు గాక!

యూదా దేశంలో కలిగిన కరువు కారణంగా ఎలీమెలెకు అతని భార్య నయోమి, అతని పిల్లలు మహ్లోను కిల్యోనులతో కలసి బేత్లెహేము విడిచి మోయాబు దేశం వెళ్ళి స్థిరపడ్డాడు. కొంతకాలానికి ఎలీమెలెకు చనిపోయాడు. అయితే నయోమి తన ఇద్దరు కొడుకులతో మోయాబులోనే నివసించసాగింది. నయోమి కొడుకులు మోయాబు స్త్రీలను పెండ్లి చేసుకున్నారు. పదేళ్ళ తరువాత నయోమి ఇద్దరు కుమారులు చనిపోయారు. నయోమి భర్త, కుమారులు చనిపోవడంతో నయోమి ఒంటరియైంది. అంతేకాక యూదా దేశంలో కరువు పోయింది అని వినిన నయోమి తన స్వదేశమనకు తిరిగి వెళ్ళుటకు నిశ్చయించుకుంది.

నయోమితో పాటు ఆమె ఇద్దరు కోడళ్ళు ప్రయాణ మయ్యారు. అయితే ఒంటరియైన నయోమి, కోడళ్ళిద్దరిని తమ తమ తల్లిదండ్రుల ఇంటికి వెళ్ళి క్రొత్త జీవితాన్ని ప్రారంభించమని సలహా ఇచ్చింది. ఓర్పా నయోమి సలహాను అంగీకరించి అత్తను విడిచి, తన పుట్టింటికి వెళ్ళుటకు నిశ్చయించుకొని తన అత్తను ముద్దాడి, ఎలుగెత్తి ఏడ్చి తన దారిన తను వెళ్ళిపోయింది. రూతు నయోమితో బేత్లెహేము చేరి దేవుని ప్రజలలో భాగమైంది. ఇది సండేస్కూల్ నుండి మనమెరిగిన సంగతి. అయితే ఈ సంచికలో ఓర్పాను గురించి కొంత లోతుగా ధ్యానిద్దాం.

సహజంగా ఓర్పా చెడ్డది, రూతు మంచిది అనే అభిప్రాయం క్రైస్తవులలో ఉంటుంది. వాస్తవానికి ఓర్పా చెడ్డది అనిపించే విధంగా ఆమె గురించి బైబిల్‌లో ఏ ఒక్క మాట వ్రాయబడలేదు. అంటే ఆమె స్వతహాగా మంచివ్యక్తే. అయితే ఆమె జీవితంలో తీసుకున్న ఒక నిర్ణయం ఆమె దేవునిప్రజల చరిత్రపుటల్లో కనుమరుగయ్యే స్థితిని కల్పించింది.

ఇద్దరు స్త్రీలలో ఒకరు కనుమరుగవ్వగా మరొకరి జీవితం ఆశ్చర్యకరంగా మార్చబడి చరిత్రలో ఘనత నొందిన స్త్రీల పట్టికలో చేర్చబడింది. అన్ని రకాలుగా ఇద్దరూ ఒకే విధమైన పరిస్థితిలో ఉండి, పూర్తి విరుద్ధమైన జీవితాలలో స్థిర పడుటకు కారణం వారు తీసుకున్న ఒకే ఒక నిర్ణయం. ఆ నిర్ణయం వెనుక ఉన్న కారణాలు, ఆ నిర్ణయం తీసుకొనుటకు దోహదపడిన స్థితిగతులను ఓర్పా జీవితం ద్వారా పరిశీలిద్దాం.

ఓర్పా ఒక మోయాబీయురాలు. అన్యురాలు. దేవుని ఎరుగకపోయినప్పటికి ఇశ్రాయేలీయుడైన కిల్యోనును వివాహామాడింది. బహుశా ప్రేమ వివాహమై ఉండవచ్చు లేదా పరిస్థితుల కారణంగా ఆమె వివాహం జరిగి ఉండవచ్చు. ఏది ఏమైనా ఓర్పా అన్యమతస్థుడుని గౌరవించగల వ్యక్తిత్వం కలది అని అర్థమౌతుంది.

వివాహానంతరం దాదాపు 10సం॥లు ఆమె నయోమితో కలసి ఒకే ఇంట్లో ఉన్నది. నయోమి మంచితనం దేవునిపై ఆమెకున్న విశ్వాసం ఎంతోకొంత ఓర్పాను ప్రభావితం చేసి ఉంటుంది. పదేళ్ళు ఇశ్రాయేలు కుటుంబంలో జీవించడం అంటే దేవునిని సన్నిహితంగా తెలుకొనుటకు ఒక మంచి అవకాశం. యూదుల ఆచార వ్యవహారాలన్నిటిలో దేవుని ఊసు ఉంటుంది. కాబట్టి ఓర్పా దేవున్ని తెలుసుకున్నది అని చెప్పవచ్చు.

ఓర్పా దేవుని తెలుసుకున్నది కాని, దేవుని ఔన్నత్యాన్ని విలువను గ్రహించలేదు. అందుకే మోయాబును పూర్తిగా విడువవలసిన పరిస్థితి వచ్చినప్పుడు ఆమె ఆలోచనలో పడింది. తటాపటాయించింది. చివరికి దేవుని తెలుసుకొను మార్గమును విడిచి మోయాబును ఎన్నుకుని దేవునికి దూరమైపోయింది.

నిజదేవుని ఎరుగక అన్యదేవతలను ఆరాధిస్తున్న ఓర్పాకు



రాణీయైన వష్తికి బదులుగా ఎస్తేరు పట్టపు రాణియైనది.

తనను తెలుసుకొనుటకు దేవుడు ఒక మంచి అవకాశాన్ని ఇచ్చాడు. ఇశ్రాయేలీయుల కుటుంబంలో చేర్చాడు. కానీ ఓర్పా విశ్వాసంలో బలపడలేదు. ఫలితంగా ఆమె దేవుడిచ్చిన అవకాశము యొక్క విలువను గ్రహించక నిర్లక్ష్యము చేసి మోయాబును ఎన్నుకున్నది.

నేటి కాలంలో క్రీస్తును అంగీకరించుట, అనుసరించుట చాలా సులువుగా మారింది. అయితే క్రీస్తు విలువను గ్రహించి, ఆత్మీయజీవితం పట్ల నిర్లక్ష్య స్వభావమును విడిచి శ్రద్ధకలిగి జీవించేవారు మాత్రమే గడ్డుపరిస్థితులు వచ్చినప్పుడు ఓర్పావలె లోకమును కాక రూతు వలె దేవుని ఎన్నుకుని దేవుని ఆశీర్వాదాలకు పాత్రులౌతారు.

పదేళ్ళలో బిడ్డలు లేకపోవడం చాలా పెద్ద కొరత. బంధువుల నుండి సొంతవారి నుండి రకరకాల మాటలు, అవమానాలు ఎదుర్కొని ఉండవచ్చు. నిరాశ నిస్పృహలలో కొట్టు మిట్టాడుతున్న వారిని నయోమి దేవుని యందలి విశ్వాసం ద్వారా ఆదరించి ఉంటుంది. తమ జీవితాలలో మార్పు కొరకు ఎదురుచూస్తున్న సమయంలో భర్త మరణం ఓర్పాను మరింత కృంగదీసింది. ఏ విధముగా ఆలోచించినా భవిష్యత్తు అగమ్యగోచరంగా కనబడుతున్నది. ఏదో విధంగా కష్టపడి జీవనం సాగించాలి కాని ఎలా? అని ఆలోచిస్తున్న తరుణంలో అత్త మరో పిడుగులాంటి వార్త చెప్పింది. అదే బేత్లెహేము ప్రయాణం.

అసలే ఒంటరి బ్రతుకు. ఆదుకునే వారేలేరు. పైగా అన్యదేశప్రయాణం. అక్కడ పరిస్థితులు ఎలా ఉంటాయో? అక్కడిప్రజలు తమను అంగీకరిస్తారో లేదో అంగీకరించినా, జీవనాధారం పెద్ద సమస్య వంటి ఆలోచనలతో బేత్లెహేముకు ప్రయాణమైంది ఓర్పా. ఎప్పుడైతే నయోమి పుట్టింటికి వెళ్ళమని సలహా ఇచ్చిందో ఓర్పాకి ఆ సలహా సరియైనదిగా తోచింది. ఎందుకుంటే ఆమె ఆ రీతిగానే ఆలోచిస్తున్నది. బేత్లెహేములో తన భవిష్యత్తు శూన్యముగా తోచుచున్నందున వెంటనే ఆమె వెనుతిరిగింది.

ఇంకా లోతుగా ఆలోచిస్తే ఓర్పా తన జీవితమును గూర్చి కొన్ని ఆశలు కలిగి ఉన్నది. తన జీవితము ఎట్లుండాలో ఆమెకు ఒక అవగాహన ఉన్నది. ఆ జీవితం బేత్లెహేములో సాధ్యము కాదని ఓర్పాకు స్పష్టముగా కనబడుచున్నను బేత్లెహేము వెళ్ళుటకు సిద్ధపడింది.

ప్రయాణమైన తరువాత, ఎదుర్కొనవలసిన క్లిష్ట పరిస్థితులను గూర్చి ఆలోచించి భయపడినది. దేవుని శక్తి సామర్థ్యాలను ఎరిగి ఉండి దేవునియందు కాక తన స్వజనులయందు నిరీక్షణ కలిగినదై తన ప్రయాణమును విరమించుకొని వెనుతిరిగింది.

"నాగటిమీద చెయ్యి పెట్టి వెనుకతట్టు చూచువాడెవడును దేవుని రాజ్యమునకు పాత్రుడు కాడు" లూకా 9:62

నేటి క్రైస్తవ స్త్రీలు అనేకులు ఓర్పా వలే దేవుడు ఇచ్చే అవకాశములను సద్వినియోగము చేసుకొనక, కనబడుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆలోచిస్తూ లోకమును అనుసరిస్తు దేవున్ని హృదయపూర్వకముగా వెంబడించక నామాకార్థ క్రైస్తవులుగా జీవిస్తూ ఓర్పావలె తమకు అనుకూలమైన వాటిని అనుసరిస్తూ అదే భక్తి, విశ్వాసము అనుకొనుచున్నారు.

ఎటువంటి క్లిష్టపరిస్థితులలోనైనను దేవున్ని విడువక ఆయనను హృదయపూర్వకంగా వెంబడించిన వారి జీవితాలను, దేవుడు దీవెనకరంగా మార్చి విజయాన్ని ఇస్తాడనే సత్యమును గ్రహించిన వారమై ఓర్పా వలె పరిస్థితులను చూడక, పరిస్థితులకు అతీతుడైన దేవుని ఆశ్రయించి మన జీవితాలను ధన్యం చేసుకుందాం!

అట్టి కృప, జ్ఞానములు దేవుడు మనకందరికి దయచేయును గాక!

**దయచేసి పత్రిక కొరకు మీరు పంపించే చందా**
**మనియార్డర్ ద్వారా పంపదలుచుకుంటే**
**ఈ క్రింద అడ్రసుకు పంపగలరు.**
**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర,**
**ఎడిటర్, హన్నాకృప ఆధ్యాత్మిక మాసపత్రిక**
**6వ లైను, క్లోపేట, ఒంగోలు-523001**
**ప్రకాశం జిల్లా, ఫోన్: 9440217726**

చిన్నపిల్లల పేజి

# దేవుని ప్రణాళిక

డిసెంబర్ మాసం కావడంతో విపరీతమైన చలి. మంచు కురవడం వలన పనులు చేసుకోవడం కూడా చాలా కష్టంగా ఉంది లండన్‌లో నివసించే పీటర్‌కి. పీటర్ దగ్గరలోని గ్రామంలో చర్చి ఫాదర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ, తన సొంత ఆసక్తితో ఒక అనాథ ఆశ్రమమును నడుపు తున్నాడు. చాలా రోజుల తరువాత కాస్త ఎండ రావడంతో వాతావరణం ఆహ్లాదకరంగా ఉన్నది. ఆశ్రమంలో పిల్లలు ఆనందంగా ఆడుకుంటూ కేరింతలు కొడుతున్నారు. అయితే దూరంగా ఒక పాప ఒంటరిగా కూర్చుని ఉండటం పీటర్ గమనించాడు.

దూరంగా కూర్చుని ఉన్నది టీనా అని గుర్తించిన ఫాదర్ ఆ పాప దగ్గరకు వెళ్ళి, అందరూ ఆడుకుంటుంటే నీవు ఒక్కదానివే ఒంటరిగా కూర్చొని ఏమి ఆలోచిస్తున్నావ్? అని అడిగాడు. ఆమె మాట్లాడలేదు. నీ స్నేహితురాలు మేరి ఏది? నీకు మేరికి ఏదైనా గొడవైందా? అడిగాడు ఫాదర్. మేరి ఈ రోజు ఆశ్రమం నుండి వెళ్ళిపోతుంది కదా! అన్నది చిన్నగా. మేరికి మంచి తల్లిదండ్రులను దేవుడు ఏర్పాటు చేసినందుకు నీవు సంతోషంగా లేవా? అడిగాడు ఫాదర్.

మేరి అన్ని వసతులు కలిగిన ఇంట్లో తల్లిదండ్రులతో ఉండటం నాకు ఇష్టమే కానీ నేను ఒక్కదాన్నే ఉండాలి అని.... అన్నది కనీళ్ళు నిండిన కళ్ళతో. ఒక్కదానివే ఎందుకుంటావ్? ఆశ్రమంలో ఇంకా చాలా మంది నీ స్నేహితులు ఉన్నారు. వారితో సంతోషంగా ఉండవచ్చును కదా అన్నాడు ఫాదర్. కొంచెం సేపు మౌనం తరువాత ఏదో ఒక రోజు వారిని ఎవరో ఒకరు దత్తత తీసుకుంటారు కదా! అప్పుడు నేను మరలా ఒంటరి దాననైపోతాను కదా! అన్నది ఏడుస్తూ.

ఫాదర్ టీనా కన్నీరు తుడుస్తూ టీనాను కారులో ఎక్కించుకొని ఒక చిన్న పార్కు వద్దకు తీసుకెళ్ళాడు. వాతావరణం ఆహ్లాదకరంగా ఉన్న కారణాన పార్కులోను కొంచెం కోలాహలంగానే ఉన్నది. పార్కులోని ఒక బెంచి మీద టీనాను కూర్చోబెట్టి పాప్‌కార్న్ తెచ్చి ఇచ్చాడు ఫాదర్. టీనా పార్కును కలియచూస్తూ పాప్‌కార్న్ తింటున్నది.

పార్క్‌లోని చెట్లన్ని మంచుతో కప్పబడి వంగిపోయి ఉన్నాయి. నిర్వాహకులు వంగిన ప్రతిచెట్టు కొమ్మలను గట్టిగా ఊపుతున్నారు. దాంతో కొమ్మలమీది మంచు అంత క్రింద పడగానే చెట్టు నిటారుగా నిలబడుతున్నది. అది టీనాకు కొంచెం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇది గమనించిన ఫాదర్, మంచుతో కప్పబడిన చెట్లు వంగిపోయి జీవం లేనివాటివలె ఉన్నవి. అయితే వాటిని గట్టిగా ఊపగానే ఆ చెట్లు మరల వాటి స్థానంలో నిలబడడంతో పాటు పచ్చని ఆకులతో చూడటానికి ఎంత చక్కగా, అందంగా ఉన్నాయో కదా!

అలానే రకకాల మనస్తత్వాలతో ఉన్న మనలను దేవుడు (చెట్లను ఊపినట్లు) జల్లిస్తాడు. వాటినే మనం కష్టాలు అనుకుంటాం కాని అప్పుడే మనం అత్యున్నత స్థాయికి వెళ్తాం. పరిస్థితులు మనకు కొంచెం కష్టంగా ఇబ్బందిగా అనిపించినా వాటి వెనుక దేవునికి ఒక ఉద్దేశ్యం ఉంటుంది. కాబట్టి దేవుడిచ్చిన ఈ జీవితమునకై సంతోషించాలి. దేవునికి కృతజ్ఞత కలిగి ఉండాలి అర్థమైందా అన్నాడు. టీనా ముఖంలో చిన్న చిరునవ్వు విరిసింది.

ఒకరోజు మధ్యాహ్న భోజన సమయంలో మంచి రుచికరమైన ఆహారాపదార్థాలు నిండిన ట్రక్ వచ్చింది. ఎవరో ధనవంతులు తమ పాప పుట్టిన రోజు సందర్భంగా ఆశ్రమంలోని పిల్లలకు భోజనాన్ని అందించారు.

మరునాడు ఫాదర్ టీనాను పిలిచి, టీనా నిన్న మనకు భోజనం స్పాన్సర్ చేసిన వారు నిన్ను దత్తత తీసుకోవాలి అనుకుంటున్నారు. మరి నీకు వారితో వెళ్ళడం ఇష్టమేనా? అని అడిగాడు. టీనా తన చెవులను తానే నమ్మలేకపోయింది. నిజంగానా? వాళ్ళు నన్ను చూశారా? చూడలేదు కదా! ఎలా మరి? అనుకుంటున్న టీనా వైపు చూస్తూ, నిజమే

టీనా, వారు నిన్ను దత్తత తీసుకోవాలి అనుకుంటున్నారు అందుకు కారణం ఏంటో తెలుసా? ఇన్నాళ్ళు నీవు బాధపడడానికి కారణమైన నీ ఆరోగ్యస్థితి. నీకు హార్ట్ ప్రాబ్లం ఉందని ఎవరూ నిన్ను దత్తత తీసుకోరని బాధపడ్డావు కదా! ఇప్పుడు నీ అనారోగ్యం కారణంగానే వారు నిన్ను దత్తత తీసుకోవాలి అనుకుంటున్నారు అన్నాడు ఫాదర్. టీనా ముఖంలో చిరునవ్వు విరిసింది. చూశావా టీనా దేవుని ప్రేమ, నీ ఆరోగ్య స్థితిని అర్థం చేసుకోవడమే కాక, ఆ పరిస్థితికి తగిన వైద్యం అందించ గలిగే వారిని దేవుడు నీ కొరకు ఏర్పరచాడు. ఇదే దేవుని ప్రణాళిక అంటే. అందుకే మనం ఎల్లప్పుడు దేవునికి కృతజ్ఞత కలిగి ఉండాలి అన్నాడు. టీనా మనస్ఫూర్తిగా దేవునికి కృతజ్ఞతలు తెలుపుకున్నది.

మరునాడు ఆ దంపతులు టీనాను ఒక హాస్పిటల్‌కు తీసుకెళ్ళి వైద్యపరీక్షలు నిర్వహించిన మీదట ఆమెకు హార్ట్‌ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీకి సిద్ధం చేశారు. ఆపరేషన్ థియేటర్‌కు వెళ్ళేముందు టీనాను వారు ఐ.సి.యు రూంలో బ్రైన్ డెడ్ అయి బెడ్ మీద పడి ఉన్న తమ కూతురు వద్దకు తీసుకెళ్ళారు. ఇప్పుడు ఆమె హృదయమునే సర్జరీ ద్వారా టీనాకు అమర్చబోతున్నారు డాక్టర్లు. టీనా హృదయం దేవుని పట్ల కృతజ్ఞతతో నిండిపోవడంతో పాటు తాను ఇన్నాళ్ళు దేవుని పట్ల తన ఆలోచన ధోరణికి పశ్చాత్తాపంతో కన్నీటి పర్యంతమైంది.

చూశారా పిల్లలూ! టీనా కూడా ఊహించని విధంగా దేవుడు ఆమె జీవితాన్ని మార్చివేశాడు. మన జీవితంలో మనకు ఏమి కావాలో ఎప్పుడు కావాలో ఆ దేవునికి తెలుసు. ఆయన మనం ఊహించేవాటికంటే అడిగేవాటికంటే అధికముగా దయచేస్తాడు కాబట్టి నాకు అది లేదు ఇది లేదు అని అనుకొనక కలిగిన వాటితో తృప్తిచెంది ఆయన నీ కొరకు ఏర్పరచిన ప్రణాళికలో భాగమై, గొప్పమేలులను అనుభవించుటకు సిద్ధపడుము.

“ నరుల యెదుట నిన్ను ఆశ్రయించువారి నిమిత్తము నీవు సిద్ధపరచిన మేలు ఎంతో గొప్పది” కీర్తనలు 31:19


## సండేస్కూల్ మెటీరియల్

| | |
|---|---|
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-1 | రూ. 50/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-2 | రూ. 50/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-3 | రూ. 50/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-4 | రూ. 50/- |
| సండేస్కూల్ కలరింగ్ బుక్-1 | రూ. 50/- |
| సండేస్కూల్ కలరింగ్ బుక్-2 | రూ. 35/- |
| సండేస్కూల్ కలరింగ్ బుక్-3 | రూ. 50/- |
| సండేస్కూల్ కలరింగ్ బుక్-4 | రూ. 50/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-1 | రూ. 50/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-2 | రూ. 50/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-3 | రూ. 50/- |
| మార్గము-వి.బి.యస్. మెటీరియల్ | రూ. 25/- |
| ఆత్మఫలము-వి.బి.యస్. మెటీరియల్ | రూ. 35/- |
| బైబిల్‌బాలలు-వి.బి.యస్. మెటీరియల్ | రూ. 35/- |
| ధన్యతలు-వి.బి.యస్. మెటీరియల్ | రూ. 35/- |
| బిగినర్స్ యాక్టివిటి బుక్ (ఒ.టి.) | రూ. 20/- |
| బిగినర్స్ యాక్టివిటి బుక్ (యన్.టి.) | రూ. 20/- |
| సండేస్కూల్ సాంగ్స్ బుక్ | రూ. 60/- |
| సండేస్కూల్ డైరి | రూ. 75/- |
| సండేస్కూల్ మోరల్ స్టోరీస్ బుక్-1 | రూ. 35/- |
| సండేస్కూల్ మోరల్ స్టోరీస్ బుక్-2 | రూ. 40/- |
| సండేస్కూల్ మోరల్ స్టోరీస్ బుక్-3 | రూ. 75/- |
| సండేస్కూల్ టీచర్స్ గైడ్ | రూ. 60/- |
| సండేస్కూల్ స్కిట్స్ | రూ. 40/- |
| సండేస్కూల్ మెమోరి వర్సెస్ బుక్ | రూ. 10/- |
| సండేస్కూల్ స్టిక్కర్స్ (32 ప్యాక్) | రూ. 160/- |
| బైబిల్ ఇండెక్స్ గేమ్ | రూ. 200/- |
| బైబిల్ ఫ్యామిలి నేమ్స్ గేమ్ | రూ. 200/- |
| బైబిల్ నేమ్స్ గేమ్ | రూ. 300/- |
| బైబిల్ వర్సెస్ స్టార్ గేమ్ | రూ. 250/- |
| బైబిల్ నేమ్స్ ప్రిడిక్షన్ గేమ్ | రూ. 120/- |
| బైబిల్ క్విజ్ గేమ్ | రూ. 300/- |
| యానిమల్స్ అండ్ బర్డ్స్ ఇన్ బైబిల్ గేమ్ | రూ. 300/- |
| హెవెన్ అండ్ హెల్ మెమోరి వర్సెస్ గేమ్ | రూ. 450/- |

**బైబిల్ లిటరేచర్ మినిస్ట్రీ**

ఫోన్ : 9440217726



# బైబిల్ క్విజ్-10



## న్యాయాధి.15-21, రూతు, 1సమూ. 1-14

1. సమ్సోను గాడిద దవడతో ఎంతమంది మనుష్యులను చంపెను?(న్యాయా. 15అ)
2. సమ్సోను ఎంతకాలము ఇశ్రాయేలీయులకు అధిపతిగా ఉండెను? (16అ)
3. మీకా తన తల్లి దగ్గర ఎన్ని వెండి రూకలు తీసికొనెను? (17అ)
4. ఆ దినములలో ఇంకనూ స్వాస్థ్యము పొందియుండని గోత్రము ఏది? (18అ)
5. ఏ గోత్రము వారు పరదేశియైన ఒకని ఉపపత్నిని చెరిచెను? (19అ)
6. బెన్యామీనీయులతో యుద్ధము చేయుటకు కూడిన ఇశ్రాయేలీయులు ఎంతమంది? (20అ)
7. ఇశ్రాయేలీయులు బెన్యామీనీయుల పట్ల ఏమని ప్రమాణము చేసిరి? (21అ)
8. ఎలీమెలెకు కుమారుల పేర్లు ఏమిటి? (రూతు 1అ)
9. నయోమి పెనిమిటికి బంధువు ఎవరు? (2అ)
10. బోయజు రూతుకు ఎన్ని యవలు ఇచ్చెను? (3అ)
11. ఎలీమెలెకు కుమారుడైన రూతు భర్త పేరు ఏమిటి? (4అ)
12. ఎల్కానా ఏ పట్టణపు వాడు? (1సమూయేలు 1అ)
13. ఏలీ కుమారుల పేర్లు ఏమిటి? (2అ)
14. తన వాక్కు చేత యెహోవా సమూయేలునకు ఎక్కడ ప్రత్యక్షమగుచు వచ్చెను? (3అ)
15. ఇశ్రాయేలీయులు ఫిలిష్తీయులతో యుద్ధము చేయుటకు బయలుదేరి ఎక్కడ దిగిరి? (4అ)
16. ఫిలిష్తీయులు దేవుని మందసమును ఎబెనెజెరు నుండి ఎక్కడికి తీసికొని వెళ్ళిరి? (5అ)
17. యెహోవా మందసము ఫిలిష్తీయుల దేశములో ఎంత కాలము ఉండెను? (6అ)
18. మందసము కిర్యాత్యారీములో ఎంత కాలముండెను? (7అ)
19. సమూయేలు జ్యేష్ట కుమారుని ఏమిటి? (8అ)
20. కీషు తండ్రి పేరు ఏమిటి? (9అ)
21. రాహేలు సమాధి ఎక్కడ ఉంది? (10అ)
22. బెజెకులో లెక్కించినప్పుడు ఇశ్రాయేలు వారు ఎంతమంది ఉండిరి? (11అ)
23. సమూయేలు యెహోవాను వేడుకొనినప్పుడు ఏమి జరిగెను? (12అ)
24. ఇశ్రాయేలీయులను ఏలనారంభించినప్పుడు సౌలు వయస్సు ఎంత? (13అ)
25. ఫీనెహాసు జ్యేష్ట కుమారుని పేరు ఏమిటి? (14అ)

### బైబిల్ క్విజ్ - 09 జవాబులు

1. 40 సంIIలు (యెహో. 14:7) 2.. అక్సా (15:16) 3. గెజెరు (16:10) 4. మహలా నోయా హొగ్లా మిల్కా తిర్సా (17:3) 5. షిలోహులో (18:1) 6. ఇశ్శాఖారీయుల (19:17) 7. ఆశ్రయపురములను (20:1-3) 8. 48 (21:41) 9. ఫీనెహాసు (22:13) 10. వేయిమందిని (23:10) 11. 110 సంIIలు (24:29) 12. కనజు (న్యాయా. 1:13) 13. తిమ్నత్సెరహులో (2:8) 14. కూషన్రిషాతాయిము (3:10) 15. లప్పీదోతు (4:4) 16. 40 సంIIలు (5:31) 17. గిద్యోనును (6:12) 18. 22,000 మంది (7:3) 19. జెబహు, సల్మున్నా (8:5) 20. యోతాము (9:5) 21. 22 సంIIలు (10:3) 22. గిలాదు (11:1) 23. 10 సంIIలు (12:11) 24. జొర్యా (13:2) 25. కొదమసింహము (14:5,6)

**బైబిల్ క్విజ్-09 జవాబులు పంపినవారు :**

1. ఆనీమేరి, హైదరాబాద్, 2. క్రిస్టియానమ్మ-నందికొట్కూరు, 3. స్వప్నిక-మార్కాపురం, 4. లలిత-రాజమండ్రి, 5. సబిత-కాకినాడ, 6. వి.రత్నమ్మ-హైదరాబాద్, 7. రాధ-నెల్లూరు, 8. స్టీఫెన్-వరంగల్, 9. కుమారి-తెనాలి, 10. వెంకట్రావు -హైదరాబాద్, 11. ప్రియ-తాడిపత్రి, 12. రాజేష్-కడప. 13. ప్రియాంక-విజయవాడ.